అంకితము

నావలెనే ఒకచోట పుట్టి
వేరొకచోటికి పోయి
'పెగళ్ళపాటి సీతారామారావు'గా
మారిన మా చిన్నబావ
'బసవరాజు గోపాలకిషన్‌రావు'కు
వివాహ సందర్భాన శుభాశీస్సులతో.

పురుషోత్తమరావు.

మరదలు

రచన:

అయ్యాదేవర పురుషోత్తమరావు

★

విజ్ఞాన దీపిక సాహితి

★

" వైజయంతీ ప్రచురణలు "

విద్యానగరు - హైదరాబాదు 7.

విజ్ఞాన దీపిక సాహితీ ప్రథమ కిరణము
ప్రథమ ముద్రణ 11 వైశాఖము 1882
ప్రతులు 2000

ముఖచిత్రం:
శ్రీ జి. రామకృష్ణ.
(సెవెన్ స్టార్స్ సిండికేట్)

సంపాదకులు:

శ్రీ గుమ్మలూరు నరసింహశాస్త్రి, బి. యస్‌సి.

శ్రీ మాదిరాజు జనార్ధనరావు.

"మానవ జీవిత వికాసానికి కళ దోహదమిస్తుంది. లలిత కళలలో సాహిత్యానికి ప్రత్యేక స్థానముంది. సాహిత్య తరువునందు నవల దోరముగ్గిన వరదు సాహిత్య జగత్తునందు సర్వాంగ సుందరియైన నవల యౌవనవతి. ఉత్తమ కావ్యంలోని లక్షణాలు, నవలలో చక్కగా పొందుపరచవచ్చు. పద్యం, వచనం. అనే భేదంతప్ప నవల, ప్రబంధం, రెండూ ఒకటే. నవల ఒక చక్కని ప్రబంధం."

"మరదలు నాతొలినవల. 1954 జూన్ నెలలో జ్వరం వచ్చిం తరువాత పథ్యం పెట్టినరోజున నిద్రపోగూడదని కలం పుస్తకం తీసుకున్నాను. మూడురోజులలో ఈమరదలు తయారైంది. చివరి పది పేజీలు తరువాత చాలా కాలానికి పూర్తిచేయబడ్డాయి. శ్రీ వేమూరి అంజనేయశర్మగారు శ్రీ సి. నారాయణ రెడ్డిగారు స్రవంతిలో వరుసగా ప్రచురించారు. ఇప్పుడు విజ్ఞానదీపిక సంపాదకవర్గం దీనిని ప్రచురించడానికి పూనుకున్నారు. దీనికి అన్నివిధాల సహకరించి, ఇంత అందంగా "మరదల్ని" అందజేసిన సహృదయులు శ్రీ పి. వేంకటస్వామి, మిత్రులు, విజ్ఞానదీపిక సంపాదకులు, శ్రీ గుమ్మలూరు నరసింహశాస్త్రిగార్లకు. కృతజ్ఞుడను".

అయ్యదేవర పురుషోత్తమరావు.

సమర్పణ

కందుకూరి, కొమర్రాజు, ప్రభృతులు ఏర్పరచినబాటను పయనమయి, ఆంధ్రకళలకు, భారతీయ కళలకు, అద్వితీయ స్థానాన్ని కల్పించ సమకట్టిన విజ్ఞాన దీపిక ప్రథమ సాహితీ కిరణము. ఈచిన్ని పొత్తము "మరదలు".

కళోపాసన పెక్కువిధములు. కళానికుంజములోని వివిధ లతలలో, అత్యంతము మనోహరమైనది ఆద్యంతమువ్యాపించినది, వినూత్న పుష్ప సౌరభ యుతము అయినది సాహితీలత. అందలి ఒక చిన్ని లేత ఆకు, రంగారు మొగ్గ, మనోజ్ఞ సౌరభములీను పుష్పము..."మరదలు".

విజ్ఞాన దీపిక ప్రధానాశయ ప్రాభవము, సంస్థఅధ్యక్షులు శ్రీ సుసర్ల సూర్యప్రకాశంగారి నిరంతర ప్రోత్సాహ బలము, సహకార్యకర్తల సంకల్పఫలము. "అయ్యదేవర" అమృతకలము ..."మరదలు".

స్నేహితులు, హితవరులు, పి. వేంకటస్వామిగారి సహాయ సంపత్తి, పీర్ మిలాప్ ముద్రణాలయమువారి ముచ్చటైన ముద్రణ, వైజయంతీ ప్రచురణ...మా "మరదలు".

ఈ మా చిన్ని పుస్తకము "మరదలు" మీ హస్త భూషణము.

గుమ్మలూరు నరసింహశాస్త్రి.

మరదలు

క్రొక్కొరోకోయని కోడి కూసింది. అది పల్లెప్రజలకు ప్రబోధం. కోడి కూయగనే లేచి వారివారి పనులందు నిమగ్నులవటం వారికి నిత్య పరిపాటి. పేరుపేరు వరుసలతో పిలుచుకుంటూ త్వరగా లేఃనివారిపై వారి సోమరిపోతు తనానికి కేకలువేస్తూ లేపుకుంటున్నారు.

* * *

అది ఒక పెద్దగ్రామం. అంతే ఒక చిన్నబస్తీకి పోటీచేస్తుంది. అందుకు కారణం ఆ చుట్టుప్రక్కలలో దానికి దీటురాగలిగిన మరో గ్రామంగాని, పట్టణం గాని లేకపోవటమే. అంతేకాకుండా ఆ యూరి సౌభాగ్యభాగ్యాలకదే సాటి. ఆ యూరు ఏటియొడ్డున సుందరంగా నిర్మింపబడింది. ఇంకొక వైపునుంచి అమృతధార కురియించే చక్కటి సెలయేరు, కొండ కోనలనుంచి ప్రవహిస్తుంది. ఆ సెలయేరు పారేప్రదేశం ఆ యూరివారికి రమ్యారామమైన యుద్యానవనం. అది ప్రవహించే కొండకు 'ఏనుగుకొండ' అని పేరు. సెలయేరు ప్రవహించే మార్గం గజముఖంగాను, దాని పై భాగం గజకుంభంగాను ఉంటుంది. అదే దాని ఆ పేరుకు కారణం. ఆ గ్రామం దానికి దక్షిణవైపు అల్లుకొని ఉంది.

అక్కడి దాని సౌందర్యగరిమను కొనియాడని, దాని సోయగాన్ని తిలకించని, సౌభాగ్యాన్ని మనసారా అనుభవించని, అబాలవృద్ధు లుండరు.

ఆ ప్రక్కనే సుందరమై నిరాడంబరమైన గణపతి కోవెల ఉంది. ఆ కోవెల ఏనాటి శిల్పకళాఖండమోగాని యిప్పటికిని అది కళలకు నెలవే. అందులోని యింద్రాళ్ళ దేవుడు కోరిన గుజ్జురూపు. అంత అందమైన దేవుడింకొక చోట ఉన్నాడంటే నేనొప్పుకోను. అది నా మతం కాదు. కల నిజ మట్లాంటిది. ఆ ఆలయం మంటపాకారంలో ఉంటుంది. ఆ మంటప స్తంభాలకు అనేక రకాల బొమ్మలు చెక్కబడి ఉన్నయి. మంటపం ముందుభాగం మెట్టుక్రింద ఎంతో చక్కని నల్లని ఎలుక చెక్కబడి ఉంది. అది నిజంగా ఎలుక పారిపోతున్నట్లుంటుంది. ఆ ఎలుక తోంటిమీద చిన్న దెబ్బ ఉన్నది. అది బాగా కనిపెట్టిచూస్తే తప్ప కనుపించదు. దానికి ఒక చక్కని చిన్న గాథ చెబుతారు.

ఆ ఊళ్లో ఒకప్పుడు పందికొక్కంత నల్లని యెలుక గాదెలలో గింజలు తింటూ ఉండేదిట. ఆ వింతఎలుకనుచూస్తే వాళ్ళకు భయం, ఆశ్చర్యం వేసేది. ధైర్యం చేసి కొంతమంది వెంటబడి కొట్టబోతే ఎటో తప్పించుకుని పారిపోయేదిట. ఇది చాలా కాలంనుంచి జరుగుతుండేది.

ఒకనాడు సింగరయ్య అనే సాతాని వైష్ణవ బిచ్చగాని యింటిలో ఒక సాధువు అతిథిగా వచ్చి పడుకున్నాడు. రాత్రి సగం దాటిం తరువాత సింగరయ్య భార్య. యీ ఎలుక క్రిందటిరోజు తనభర్త బిచ్చమెత్తి తెచ్చి రేపటి భుక్తికోసమని ఉంచిన గింజలు తింటూండగా చూసిందట. గోలచేసింది. సింగరయ్య అదిలించబోయినాడట. ఆ యింటిలో ఉన్న సాధువులేచి, అది తెలుసుకుని, ఆ ప్రక్కనున్న మేకును తీసుకుని విసిరాడట. అది దానికి తోంటిమీద తగిలిందట. ఆ ఎలుక రక్తంగారు

కుంటూ కోవెలవేపు పరుగెత్తిందట. అంతా రక్తచారికల వెంట బోయి చూస్తే కోవెల మీదనున్న రాతి ఎలుకకు తుంటిమీద గాయంపడి రక్త ప్రవాహం కాలువలు కట్టిందట. అది చూడగానే పాప మా సాధువు నెత్తురు గ్రక్కుకుని అక్కడే సొరిగిపోయినాడట.

సింగరయ్య, సింగరయ్యభార్య భయంతో వణుకుతూ "స్వామి! ఎరక్కపోయి నీమీద చెయిచేసుకున్నాం. నీకు చేయరాని మహాపచారం చేశాం లేకపోతే నీమీదనా తండ్రీ! మేం చెయి జేసుకోవటం? నీవు కోరితేరానిదేమిటి స్వామి! నీ కెందుకీశ్రమ యిల్లిల్లు తిరగటం! మేము చేసిన యీ అపరాధానికి ప్రాయశ్చిత్తంగా నా యావజ్జీవమేకాకుండా నా వంశపారంపర్యం నావాళ్లు నీకు రోజూ భిక్షాటనచేసి తెచ్చింది తెల్ల వారకమునుపే నైవేద్యం పెడతాం. మమ్మల్ని మన్నించి దీన్ని ప్రతి ఫలంగా స్వీకరించు స్వామీ! ఇక మీదట మాయింటిపేరు నీపేరు పెట్టు కుంటాం." అని నమస్కరించి: సింగరయ్య తానొక చిన్న వైద్యుడవ టంవల్ల గాయం కడిగి ఏదో ఆకుపసరు పూశాడట. అపుడు గాయం నయ మైందిగాని గాటుమాత్రం పోలేదు. అసలు దేవుడికన్న కొనరుదేవుడి ప్రభ ఎక్కువయింది. ఆరోజు లగాయితు సాతాని సింగరయ్యని ఎలుక సింగరయ్య అని పిలిచేవారు.

అక్కడే యింకో పవిత్ర స్థానంఉంది. ఒక రావిచెట్టు, వేపచెట్టు ఎంతో శృంగారంగా కలియ మొల్చుకుని ఉన్నయి. అది మనోహరంగా ఎంతోకాలంనుంచి వెలిసి ఉంది. దానికి జరిగే పూజా పునస్కారాలు లెక్క లేనివి. అది పచ్చగా కళకళ లాడుతూ అత్యంత మంగళ ప్రదంగా ఉంటుంది.

ఆ పెలయేటి నీటితడుపువల్ల నెల్ల సస్యజాలము ప్రకాశవంతముగ నెదుగుతు ఎంతో చల్లదనమూ నెల్ల వేళలా చేకూరుస్తుంటయి.

కోవెల ముందొక సరస్సున్నది. అందలి స్వచ్ఛవారి సొగసరియై కమ్మని తామరల నీనుతుంది. ఆ కొలనిలో తామరలకు కలువలకు నిత్యము పోరాటము సంభవిస్తుంది. ఒకరిది దినరాజ్యము. మరొకరిది రాకారాజ్యము. వారి రాజు వచ్చినప్పుడు వీరు వీరి రాజువచ్చినప్పుడు వారు పరస్పరము తిట్టుకొందురు. ఏది యేమైనను పగలొకరు రాత్రొకరు అనన్యముగ రాజ్యముజేసి యాసరసిని సార్ధకము జేయుదురు. దానిలోని గణపతి కోవెల ప్రతిబింబము ఎంత మనోహరమైనదో మూర్ఖునకైనను జెప్పనక్కరలేదు.

ఆ ప్రదేశము చల్లదనమున కాలవాలము. ఎందరకో ఏకాంత శృంగార ప్రదేశము. రసికజన మనోభిరామ మేమో? అక్కడి బాల చంద్రుడు. అక్కడి బాలభానుడు. అక్కడి సాయంత నారుణార్కుడు అక్కడనేసాటి!

కాలకృత్యాలన్నీ తీర్చుకొనిఅంతా పనిపాటలకు పోతున్నారు. ఆ ఊళ్లో పేరెన్నికగన్న ధనవంతుల కుటుంబాలెన్నో ఉన్నయి. అందులో వృద్ధిలో ఉన్నవీ ఎక్కువగానే ఉన్నయి. వారిలో రంగధామయ్య ఆ యూరిలో పెద్ద తల. ఆయన యింటి ప్రక్కయిల్లు ఆయన బావమరది జానకి రామయ్యది. రంగధామయ్య మాట ఆ యూరిలో గీటురాయి. జానకిరామయ్యకు యింటి ప్రక్క జాగా యిచ్చింది ఆయనే. రంగధామయ్యకు యిద్దరు కుమాళ్లు; ఇంద్రుడు. చంద్రుడు. పెద్దవాడి పేరు మహేంద్రుడు. చిన్నవాడి పేరు బాలచంద్రుడు.

మహేంద్రుడు మర్యాదగల మనిషి. కొద్దిగా ఇంగ్లీషు చదువుకున్నాడు. తెలుగు మాత్రం బాగా చదువుకున్నాడు. తెలుగులో చిన్న కవిగూడా. తెలుగుమాట చెవిటే అతనికి ఒళ్ళు పులకరిస్తుంది. ఆ ఊళ్లో చిన్న పఠనమందిరం ఏర్పాటుచేసి నిజమైన తెలుగు బోధిస్తుంటాడు.

అతని శిష్యులలో లింగయ్య అనే అతడు బాగా పైకి రావటంలో మహేం ద్రుడికి శ్రమ చాలవరకు తప్పింది. ఊళ్లో అతడు తండ్రికి సరియైన కొడుకని, అచ్చంగా తండ్రి నోట్లోంచి ఊడి పడ్డాడని పేరు. అతని వేషభాషల్లో అచ్చంగా తెలుగుదనం ఉట్టిబడుతుంది. అవసరాన్నిబట్టి కొద్దిగా ఇంగ్లీషు వాడటమేగాని వృథాగా పొల్లు పోనివ్వడు. విగర్వి.

బాలచంద్రుడు పుట్టుకచే భాగ్యవంతుడేగాని బుద్ధిచే భాగ్యహీనుడు. వర్తిస్తుంటరి; గడుగ్గాయి. చిన్ననాడెప్పుడూ అన్నతో జగడాలే; అన్నమీద కొండాలే. ఇక బైట సంగతి చెప్పనే అక్కరలేదు. ఇంగ్లీషు చదువు కున్నాడు. స్కూలు ఫైనలు చదివాడు. పరీక్షకు పోనూలేదు. తప్పనూ లేదు. ఇతని వయస్సు పద్దెనిమిది. అన్నకంటె రెండేళ్లు చిన్న. ఊరి వారితడిని రాక్షసుడిగా చూస్తారు. దీర్ఘకాయుడు, స్ఫురద్రూపి. తనకు తోచినదే తప్ప ఇంకొకటి వినిపించుకోని మూర్ఖుడు.

జానకి రామయ్య నోట్లో వేపపుల్ల పెట్టుకుని నములుతూ ప్రక్క ద్వారంలోనుంచి రంగధామయ్య యింట్లోకి వచ్చాడు.

"మామయ్య ఏదో పనిమీద బయలుదేరినట్లున్నాడు. లేకపోతే ఇంత పెందలాడే యిల్లు కదలడే!" అన్నాడు చంద్రుడు,

చంద్రుడు మంచి మాటకారి. ఆ మామయ్య అంటే కాస్త గౌరవం. ఎప్పుడయినా చమత్కారంగా మాట్లాడితే ఆయనతోనే.

"ఏం! రాకూడదా! అర్నీయిల్లు బంగారంగాను! ఇంటిపక్క యింటికి రావటానికి కూడా పనుండాలా ఏం? అది సరేగాని ఎక్కడికి ప్రయాణం సాగిస్తున్నట్లున్నావు? ఇంత పొద్దున్నే!"

"ఎబ్బే! ఎక్కడికిలేదు మామయ్యా! కాస్త తోటలోకి వెళ్దా మనుకున్నాను."

"అబద్ధం చెప్పినా అతికేట్టుండాలి! వేళగాని వేళలో తోటకిప్పుడు దేనికి పోతున్నట్టు? ఏమోరా! నీ వ్యవహారం ఏమీ బాగుండలేదు. ఎప్పుడూ నీవూ నీవేషమూను. నీకు తోడు ఆ గుఱ్ఱమొకటి దొరికింది మీ నాన్న చలవన. అసలు నీవా గుఱ్ఱాన్ని దిగనే దిగవాయె. ఎప్పుడయినా తిననిచ్చేదుందా! అదేం చచ్చేందుకా బతికేందుకా! పొద్దున్నే లేస్తావు. దాని మీదెక్కి ఎక్కడికో పరారు చిత్తగిస్తావు. మళ్ళీ మిట్టమధ్యాన్న మపుడు అన్నానికి; అది తప్పితే అర్ధరాత్రికేగా రావటం. ఏమైనా యిదేం బాగాలేదు మరీయింత విపరీతం ఎక్కడా చూడలేదు. అయినా నీ యీడువారు పెద్దవారు లేరు? వాడెట్లా ఉన్నాడు; నీవెట్లా ఉన్నావు? వాడికున్న పరువు మర్యాదా ఏమిటి; నీ పరిస్థితి ఏమిటి? నీ విట్లా ఆగాయి పోగాయిగా తిరుగుతున్నావంటే మీ నాన్న పరువు మర్యాదా ఏంగాను. ఇప్పటికే నీ దయవల్ల నాశనమైందిగదా అనుకో. దీనికేం అంతూ పంతూ ఉండనక్కర్లా! ఆయన విన్నెందుకు మందలించటం లేదో ఆలోచించావా? చిన్నవాడు చిన్నతనమని వదలిపెడితే ఏకుమేకై నట్టు యికెంప్పుడొస్తుందిరా పెద్దమనిషితరహా! ఇది తెలిసి చేస్తున్నావా; తెలియక చేస్తున్నావా! నీకేం లేకపోయింది! అరెరే! నీతోటివాడి తరహా ఏమిటి? నీకీ ఆతకాయి వేషాలేమిటి? ఇదేంబాగుండలేదు! ఇంత యీడువచ్చి మార్చుకోలేనివాడివి యింకెప్పుడు మార్చుకుంటావు."

అని జానకిరామయ్య అంటుండగా లోపలినుంచి బంగారు తీగలతో చుట్టబడిన కళ్ళజోడు సవరించుకుంటూ సరాయిస్తూ రంగధామయ్య వచ్చాడు.

రంగధామయ్యకు అరవై ఏండ్లుంటాయి. బుంగమీసాలు. గుమ్మడి కాయంత బొజ్జ. ఎఱ్ఱని దేహచ్ఛాయ. అతని ఎఱ్ఱజీరలుగల కళ్ళు చూడ టానికి చాల భయంకరంగా ఉంటాయి. ఆయన ఒకవైపునుంచి ప్రవేశిస్తుంటే చిన్నకొడుకు రెండోవైపునుంచి లోపలికి జారుకున్నాడు.

"ఏమిటో మట్లాడుతున్నావు ?"

"ఆ—మన రెండోవాడిసంగతి. వాడికేదో చెబుతున్నా, ఇంతలో నువొచ్చావు. దానికేంగాని యివ్వాళ నీతో మంచి విషయ మొకటి మాట్లాడాలనే వచ్చా; వాడన్నట్టువనుండే వచ్చా."

"ఏమిటయ్యోయి ! ఏదో కొంపముంచుకుని పొయేదే అట్టుందే. నిలబడే మాట్లాడుతున్నావు ! కానియ్యి నీ ఓపికకూడా పరీక్షచేద్దాం."

"ఓపిక పరీక్ష అయిపోయింది బావా! ఇంకా ఎంతకాలమని ఓపిక పట్టమన్నావు ? నీకేం పరీక్ష చేస్తావు చెయ్యవుమరీ; మగపిల్లలు గలవాడివి. నీతో ఆడపిల్లలు గలవాడిని నేను వంతం పెట్టుకుంటే కుదురుతుందా ? నామాట తప్పక నెగ్గించమని గట్టిగా అడగటానికే నిలబడి మాట్లాడుతున్నానని అనుకోగూడదాయేం ?"

"ఉన్న ఒక్క ఆడపిల్లకి అంత తొందరపడతావేమోయ్ ?"

"ఇంకా నయం. పాలుదాగే పిల్ల కప్పుడే ఏం తొందరొచ్చిందనలా ?"

"మరి నాకు కట్నం బాగా కావాలే !"

"నన్నెందుకు హాస్యం పట్టిస్తావు బావా ?"

"మొత్తంమీద బాగానే తయారైనావే ?"

"వేళాకోళానికేంగాని లగ్నం యివ్వాళే నిశ్చయం చేయాలి బావా!"

అంటూ ప్రక్కన కూర్చున్నాడు జానకి రామయ్య.

"నేనుమటుకు కాదన్నానా? అది యింతకీ ఎవర్ని నచ్చుతుందో"

"నేనడిగితే సిగ్గుపడి చెప్పటం లేదు. అదేదో నీవే పిల్చి కనుక్కో అదెవర్ని చేసుకుంటానంటే వాడికి చేసుకోవటం నీకిష్టమేనా?"

"చేసుకుందేవాడూ ఒప్పుకుంటే మధ్య నాకేం? అమ్మాయి సుశీలా! సుశీలా!!" అని పిలిచాడు మేనగోడలయిన పెళ్ళికూతుర్ని.

'ఏమిటి మామయ్యా!' అంటూ వచ్చింది ఆ అందాల బరణి సుశీల.

రంగధామయ్య ఆమెవేపు తదేకధ్యానంగా చూస్తున్నాడు.

"ఏమిటి! మామయ్యా! అట్లా చూస్తున్నావు?" అంది సుశీల.

"ఆ—ఏం లేదమ్మా! ఆ ముఖం మీద తుడుచుకో."

"పౌయిరాజేస్తుంటే పిలిచారు. మసి అంటింది గాబోలు" అంటూ చిరునవ్వుతో తుడుచుకుంటున్నది.

"నా చిట్టితల్లి; అమాయికురాలు. చూడమ్మా సిగ్గుపడకుండా చెప్పు. పెళ్ళి చేసుకోటానికి నీకు ఎబావ యిష్టమో?"

సుశీల సిగ్గుతో తలవంచుకుంది.

"పరవాలేదు చెప్పమ్మా" అని అందుకున్నాడు జానకిరామయ్య.

సుశీల మళ్ళీ మాట్లాడటం లేదు. సిగ్గుతో తలవంచుకుని నేల చూస్తునచది. ఇంతలో జానకి రామయ్య అందుకుని "చూడు తల్లీ! ఇది పెళ్ళి విషయం. జీవితంతో సంబంధించింది. తొందర పడ కూడదు. బాగా ఆలోచించుకునే చెప్పు. ఇందులో బలవంతం ఏమీలేదు. నీకు నచ్చిన బావనే చెప్పు."

"పెద్ద—బావ" అంది మెల్లగా సుశీల.

రంగధామయ్యకు అపుడే మనుమడి నెత్తుకున్నంత సంతోషమైంది. జానకి రామయ్య కళ్ళకు ఆనందబాష్పాలు నిండాయి. మహేంద్రుడు తల వని తలంపుగా తనకు నాకలోక తలోదరి సాక్షాత్కరించినట్లనిపించింది.

"బాగా ఆలోచించావామ్మా" అన్నాడు జానకి రామయ్య.

"ఔను నాన్నా! నేను పెద్ద బావనే చేసుకొంటాను." అంది కాస్త ధైర్యంగా సుశీల.

"ఏం! నేనెందుకు చేసుకోకూడదు?" అంటూ చంద్రుడు లోపల్నించి బైటికి వచ్చాడు.

"తమ్ముడు చేసుకుంటా నంటున్నాడు" అని అతని పరమ సాత్వికాన్ని తెలియజేస్తూ అన్నాడు మహేంద్రుడు.

రంగధామయ్య ఆ సాహసానికి నివ్వెరపోయినాడు. 'ఏమమ్మా' అన్నాడు జానకి రామయ్య సుశీలవైపు చూస్తూ.

"నాకు పెద్ద బావే కావాలి! నాకింకొకళ్ళు అక్కరలేదు. ఆయనకు యిష్టం లేకపోయినా సరే" అంటూ మహేంద్రుడి దగ్గరకు పోయి "బావా! నేను నీకు యిష్టం లేదా? నిన్ను చేసుకుంటానంటే అట్టే మెత్త బడతావేమిటి?" అంటూ కళ్ళ నీళ్లు తుడుచుకున్నది.

"ఎందుకట్లా అవుతావు ఛా! ఏమిటి యిది; చిన్నతనపు చేష్టలు; అంటూ సముదాయించాడు మహేంద్రుడు.

"ఏమైనా సుశీల నాకే కావాలి. ఆలోచించుకోండి; లేకపోతే నేనూరుకోను తరువాత మీ యిష్టం. పశ్చాత్తాప పడవలసి వస్తుంది." అని చంద్రుడు కాస్త తీవ్రం చేశాడు.

"నోర్ముయి! ఏమిటా ప్రేలాపన లోకంలో ఉన్న ప్రతిదీ నీకే కావాలి! అక్కరలేందేది. అందమైన వస్తువునల్లా కాజేయాలనే జూస్తారు నీబోటివాళ్లు. బయట ఎట్లా చస్తే నాకేమని ఊరుకున్నాను. ఇంట్లో కూడా సాగించావు నీ వెధవ వేషాలు! నీకెందుకురా పెళ్లాం దేశదిమ్మరికి? నీకు కావాలంటే సరిపోయిందీ! అదీ నిన్ను కోరక్కరలేదా? అయినా అన్నను కోరిందాన్ని; తల్లితో సమానమైనదాన్ని; కోరుతున్నావా! బుద్ధి

గలిగి యింటిపట్టున ఉంటే నీకు పిల్లలే దొరక్కపోయినారా? కుళ్లుబోతు వేషాలు; ఓర్వలేని చేష్టలు చిన్ననాటి నుంచి వాడి మీదికి ప్రతిదానికి నవాలే. వాడు బుద్ధిమంతుడై నాకెందుకులే అని ఊరుకోబట్టి గాని లేక పోతే ఎప్పుడో నీ తోలు ఒలిచి ఉండేవాడు. దరిద్రపు బుద్ధులు కాకపోతే యెందుకు పుట్టినట్టు నీకీ దుర్బుద్ధి." అని రంగధామయ్య అంటూండగానే చంద్రుడు ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. "పో! పోక యింట్లో ఉండి మమ్మల్ని ఉద్ధరించి చచ్చిందెన్నడు?"

"ఎందుకు నాన్నా! అట్లా తొందరపడతావు." అన్నాడు మహేంద్రుడు,

"ఏడిశాడు అంట్ల వెధవ! దరిద్రుడు దొరికాడు ఎంత నామర్దాగా ఉంది వీడితో."

"అదే మామయ్యా ఇందాక మందలిస్తున్నది."

"వాడికి ఎన్ని చెప్పినా అంతే. యీ చెవితో వింటే ఆ చెవితో మరిచిపోతాడు."

"అదే బావా వచ్చింది వీడితో! ఏమీ బాగా లేదు వీడి విషయం ఊళ్లో. నీతో చెప్పటానికి ఎవరు సాహసించటం లేదు. దేనికైనా సహిస్తారు గాని ఆడపిల్లల జోలికి పోతే మాత్రం ఊరుకోరు. మరీ అదీ ఈ యేడే మొదలుపెట్టాడు ఎక్కడ ఎవరు పక్కలు విరగబొడుస్తే మనం నలుగురిలో తలెత్తుకునే ప్రాప్తం లేకుండా పోతుందో అని భయంగా ఉంది" అన్నాడు జానకి రామయ్య.

"ఇంకా నీకేమైనా అనుమానముందా? ఇప్పటికే పరువు చచ్చిపోయింది. లాభంలేదు. మనల్ని గురించి వాళ్ళు నాశనం గావటం నాకిష్టం లేదు. నేనే చెబుదామనుకుంటున్నా!" అన్నాడు రంగధామయ్య వికటంగా.

''ఏమని?'' అని అందుకుంది సుశీల.

''నాకేం సంబంధం లేదు. మీ జోలికి వస్తే వక్కతట్లు విరగ బొడవండి అని."

''ఇంకా నయం. నీ పుణ్యమా అని ఆ పుణ్యం కట్టుకోలేదు.'' అన్నాడు జానకి రామయ్య.

"లేకపోతే మన బిడ్డ మనకు ముద్దయితే ఊరికేం ముద్దు?''

''ఎంత కాకపోయినా—''

''పాలుపోసి పెంచిన పాము పడగ మీదికి విసిరితే ఎంత పెంచితే మటుకు మమకారం చూపుతార్టయ్యా. మాడు చితకబొడవక? వెఱ్ఱివాడా''

"సరే! మన మాటేమంటావు?''

"అనేదేముంది నీ యిష్టమొచ్చినపుడే.''

''మరి—అయితే నేను బ్రాహ్మడికోసం వెళ్ళిరానా?''

"వెళ్ళిరా.''

౨

కొద్దిగా ప్రొద్దెక్కుతున్నది. తూరుపు కొండలు బాగా ఎఱ్ఱబడ్డయి. రవి బింబం తేజోవంతంగా ఉంది. ఎవరో గుఱ్ఱంమీద వస్తున్న చప్పుడైంది, ఎవరో గాదు చిన్నబాబు. గుఱ్ఱం ఎగువకు ఎక్కింది చిన్న బాబు చాలా కోపంగా ఉన్నారు. గుఱ్ఱం వెనక్కు లాగుకుంటూ మెల్లగా అడుగులో అడుగు వేస్తూ ముందుకు నడుస్తున్నది. దాని విషయంలో బాలచంద్రుడు ఏమీ శ్రద్ధ పట్టించుకోవటం లేదు. లేకపోతే ఆ మారాయింపుకు వీపు తాషామరపామోత ఎక్కవలసి ఉంది. చేతిలో నున్న జొన్న అకు మాటిమాటికి వళ్ళతో పీకి పారవేస్తున్నారు. అది యిపుడు

అయిపోయింది. ఏదో జ్ఞాపక మొచ్చినట్లైంది. ఒక్క మాటు కాలితో అదిలించాడు. గుఱ్ఱం ముందుకు సాగివచ్చి వినాయకుడి గుడి ముందు ఆగింది. చిన్నబాబు దానిమీద నుంచి మెల్లగా జారాడు. చేతిలో కఱ్ఱ చంకలో పెట్టుకొని, ఆ ప్రక్కనున్న ఆకు నొకదానిని కోసికొని, దాన్ని చుట్టచుడుతూ సెలయేటి ముఖద్వారపు కొండవైపు నడుస్తున్నాడు. అక్కడ ఎండకు తావులేదు. చల్లగా నిర్జనంగా ఉంది. కొండమీద ఒక చిన్న తిన్నె మీద చిన్నవాడు కూర్చొని చూస్తున్నాడు, నలువైపులా.

సెలయేరు జలజలా ప్రవహిస్తున్నది: కోయిల సన్నని కంఠంతో పాడుతున్నట్లున్నది. అందులో యెంతో యింపైన స్థాయిభేదాలున్నాయి. చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. దాని తాకిడికి చెట్ల ఆకులు అల్లనల్లన కదులుతున్నయి. అప్పుడు సన్నగా ఎవరో వాయులీనం వాయిస్తున్నట్లున్నది మధ్య మధ్య అక్కడ ఉన్న మఱ్ఱికాయలు రాలిన శబ్దం వినిపిస్తున్నది. అది వీణానాద మనిపిస్తుంది. అదే సెలయేటి జాలులో గాని కొలనిలో గాని పడినపుడు జలతరంగిణి వినిపిస్తుంది. ఎంత చక్కగానో పుష్పించిన పూవులు అనేక రంగులు గలవి ఉన్నాయి. కొన్ని ఆకుల మాటున దాగి ఉన్నాయి. భానుడు ఆ చెట్ల ఆకులలో నుంచి పూలమీద ఎంతో కాంతివంతంగా ఒకప్పుడు ఎఱ్ఱగా మరొకప్పుడు పచ్చగా వేరొకప్పుడు ఊదారంగుగా పూలరంగులను బట్టి తన కాంతి పుంజాలను మారుస్తున్నాడు ఆకులసందు నుంచి వెలుతురు సన్నసన్నగా అక్కడక్కడ నేలమీద కొలని తామరాకులమీద పడుతుంటుంది. రాత్రి రాలిన ఎండుటాకులు ఉదయం వీచిన పిల్లగాలులచే వినాయకుని ప్రాంగణం శుభ్రం చేయబడింది. సూర్యుడు తన తెల్లని కిరణాలు పార్వతి ముద్దు తనయుని ముఖమందు మాత్రం బాగా ప్రసరింపజేస్తున్నాడు. రాత్రి కురిసిన మంచు బిందువులపై సూర్యకిరణాలు పడేసరికి అవి ముత్యాలకోవ లైనాయి.

నేలపై మెత్తని లేపచ్చిక దూది పరుపులను కాదనిపిస్తుంది. ఒడ్డునే పచ్చిగడ్డిపై విశ్రమిస్తే ప్రక్కనే పాపాయి పరుగువోలె తెల్లగా స్ఫటికబాయన నీరు ప్రవహిస్తుంటుంది. ఒడ్డున పడుకుని చేత్తో నీళ్ళు త్రాగితే నిద్రపోయి లేచి భోజనం చేసినంత శక్తి వస్తుంది. ఇప్పుడు బాలచంద్రుడు అదే పని చేస్తున్నాడు. లేచి కూర్చుని మోకాళ్ళను ఒక చేతితో చుట్టి ఎత్తి ఊపుతూ రెండవ చేతితో మెల్లగా పచ్చికను పీకుతున్నాడు.

అల్లంత దూరాన అతని గుఱ్ఱం మెల్లమెల్లగా పచ్చిక కొరుకుతున్నది. అది ఊరు గొడ్లకు వాలైన ప్రదేశంగాదు. అందుచేత నీడు మల్లేగాక గడ్డిదట్టంగానే పట్టి ఉంటుంది. అతని గుఱ్ఱం వాళ్ళ నాన్నగారి యింట్లో ఉన్న గుఱ్ఱాలలో కల్లా మేలైనది వాళ్ళ యింట్లో ఒక ఆడ గుఱ్ఱం మగగుఱ్ఱం రెండు పిల్లలు యిది ఉన్నాయి. ఇది చాల లేతకారుది. స్వచ్ఛమైన జాతిగలది. తెల్లనిది. ఆ చుట్టుప్రక్కల అంత మంచి గుఱ్ఱం లేదు. అది చిన్ననాటి నుంచి చిన్నబాబుకే అంకితమైంది. దానికి స్వారీ నేర్పింది కూడా అతడే. దానిని క్షణం నీళ్లు త్రాగనివ్వడు. ఆయన కది ప్రాణం. దాని కాయన ప్రాణం. చంద్రుడు ఎవరినీ నమ్మడు. అతనికి ఎవ్వరూ స్నేహితులు లేరు. స్నేహితుడంటూఉంటే ఆ గుఱ్ఱమొక్కటనే చెప్పాలి.

సెలయేటి కెవరో పన్నెండేళ్ళ వాడు నీళ్ల త్రాగడానికి వచ్చాడు. నీళ్ళు త్రాగి ముఖం కడుక్కుని పై చెంగుతో తుడుచుకుని కర్ర చేత పట్టుకొని పోబోతున్నాడు.

"ఒరేయ్! రాముడూ;" అని పిలిచాడు చంద్రుడు.

"చిన్నబాబుగారా!" అంటూ వాడు దగ్గరకు వచ్చాడు.

"అరేయి! ఈ డబ్బులు తీసుకొని వెళ్ళి సంగయ్య హోటల్లో నాలుగిడ్లీఉప్మా తీసికొనిరా?"

"చిత్తం! అయ్యా!" అంటూ వాడు వెళ్ళిపోయాడు.

అప్పటికి అపరాహ్ణం తిరిగిపోయింది. రోజీ పాటి కింటి చేరుకునేవాడు చంద్రుడు. ఇంకా ఆ ప్రయత్నంలో లేడు. అంతే కాకుండా ఏదో పెద్ద మొత్తానికే హోటలుకు డబ్బులు పంపాడు. ఏదో ఎత్తు వేస్తున్నాడు. ఇంటికి పోయే సూచనలేమీ లేవు. ఇక్కడ ఉండి తనేమిచేద్దామని? కొంప గోడు లేనివాళ్ళకిదొకటి దొరికింది; కాశ్మీరం. అది అచ్చంగా కాశ్మీరాన్ని జ్ఞాపకం తెస్తుందంటారు చాలా మంది అదీ యిదీ చూచిన వాళ్ళు. తన పంతం నెగ్గాలి. ఎంత అవివేకి? తండ్రి మంచివాడే. తను కోరేది ఒక్కటే అయితే అది కొండమీద కోతి అయినా దిగివస్తుంది. అందమైన వస్తువు ఇంకొకరు వాడుకొనరాదు. అన్నీ తనకే కావాలి. పంతానికి కాకపోతే తన మీద యిష్టం లేని పిల్లని తను కట్టుకుని మాత్రం ఏం సుఖపడుతాడు? తనను చేసుకోనన్నది గనుక పట్టుబట్టి ఏ విధంగానైనా చేసుకుని నానా ఏడుపులు ఏడిపించాలని కోరిక. అంతేగా? అది మంచి మానవుడి లక్షణమేనా? అందులోను తను అయినవాడు కోరుకోవలసిన కోరికేనా అది? ఎదటి బాగోర్పులేని తనటోటి వాడికి శిక్ష ఏమిటో తెలుసుకుంటున్నాడా? తన దేశదిమ్మరి తనానికి పెళ్ళెందుకూ? పెళ్ళాము సంసారమూ ఎందుకూ? దాని గొంతు గోయటమేగా? అయితే యిట్లా పెళ్ళి పెటాకులు లేకుండా అచ్చువేసిన ఆబోతును విడిచిపెట్టినట్లు ఊరుమీద విడిచిపెట్టవలసిందేనా? పెళ్ళిచేయక తప్పదు. చెయ్యకపోతే మర్యాద గూడా దక్కదు. ఆ పిల్లను తప్ప యితరులను చేసుకోనంటున్నాడు గదా? మరి ఆ పిల్ల యితడిని చేసుకోదు. ఇష్టం లేనప్పుడు ఆ పిల్లనుఎవరు బలవంతం చేయగలరు? ఆ తండ్రి మేనమామలకు ఇతని

పొదే గిట్టదు. అయితే చంద్రుడికిక్కడిట్లా కారాలు మిరియాలు నూరు కుంటూ ఎంత కాలం ఉంటాడు. ఇదంతా భ్రమ. ఆ పిల్లని చేసినా ఏ పిల్లని చేసినా పుట్టెకు పుట్టిన బుద్ధి పోతుందన్నది కల్ల. మరి ఊళ్ళో వాళ్ళమీద చెయిచేసుకుంటే వాళ్లు ఊరుకుంటారా? ఎందుకూరుకుంటారు. ఊరుకున్నా ఒకటి రెండు దఫాలు మర్యాదకు. ఆ పెద్దమనిషిని జూసి. ఆయన అంటించుకోడన్న సంగతి తెలిస్తే ఎవడో ఒకడు పక్కతట్టిరగ బొడిచి మూల యెముక జారదీస్తాడు. అంతేగా ముష్టి బ్రతుకు. ఇంత బ్రతుకూ బ్రతికి యింటి వెనకాల జచ్చినట్లు ఇటువంటివాళ్ళ కంతగాక ఎంత? చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవ;

ఇంతలో రాముడు వచ్చాడు. తెచ్చినవి చేతికిచ్చాడు.

"ఇంకా ఎంతుందిరా?" అన్నాడు చంద్రుడు.

"రెండణాలు."

"అది తీసికెళ్ళి కొనుక్కుతిను."

"ఆ—ఎందుకు బాబయ్యా నాకు?"

"పోరా! వెధవ! ఇందులో మొఖమాటం కూడానా నీకు."

"ఇంకా ఏమైనా కావాలాండి?"

"అక్కరలేదులే పో."

వాడు గంతులేసుకుంటూ ఆనందంతో వెళ్ళిపోయాడు.

చంద్రుడు మెల్లిగా పొట్లాలు విప్పి అంతా ఖాళీ చేశాడు. ప్రక్కనే ఉన్న సెలయేటి నీటిని త్రాగాడు. ఇంక కావలసిందేమిటి? అమృతా స్వాదం కూడా అయిపోయింది. కొండంత బలం చేకూరింది. కానీ కర్తవ్యమేమిటి?

చంద్రుడికేం తోచటం లేదు. మహేంద్రుడు తన అన్న చిన్న నాటి నుంచీ అతనికి యితనికీ నిప్పులో ఉప్పే. వాళ్ళిద్దరికి మధ్య వచ్చి గడ్డి వేస్తే భగ్గుమనేది. అతని తరహా వేరు. అనేక మాట్లు వాళ్ళిద్దరికీ తెగపట్ల గోత్రం వరకు వచ్చింది. వీరిద్దరికీ మధ్యవర్తి మరదలు సుశీల. ఆమె ఎప్పుడైనా వీళ్ళిద్దరినీ విడదీస్తే. లేకపోతే ఆరోజు రక్తం కళ్ళ చూడవలసిందే. మహేంద్రుడు కూడా అప్పుడు మొండితనం చూపించే వాడు. ఎంత ఓపికస్తుడయినా ప్రక్క వాడు కవ్వించి ఉసలు కొడుతుంటే ఎంతసేపని నిదానం వహిస్తాడు? అందులోను చిన్నతనం. ఎటొచ్చీ మూడేళ్ళ నుంచి అసలు మాటలు లేకుండా పోయినయి అన్నదమ్ములకు. ఎప్పుడయినా మహేంద్రుడే ఏదయినా విషయం తమ్ముడుతో మాట్లాడబోతాడు. దానికి చంద్రుడు సమాధానం చెప్పకపోగా కసురుకుంటాడు అంతమాత్రం చేత మహేంద్రుడు కోపగించుకోడు. మహేంద్రుడు తలచుకుంటే తను సోదిలోనికి రానన్న సంగతి అతనికి విదితమే. అంత మాత్రం చేత పుట్టె పొగరు తల వంచనిస్తుందా?

చంద్రుడు మహేంద్రుడు కన్న పొడగరి. తగిన లావు. దృఢ శరీరం, పచ్చని రంగు, అందమైన కోల ముఖం. చక్రాల వంటి కళ్ళు, కోపంచేత అవి చివరలు ఎఱ్ఱబడి ఉంటాయి. ఎఱ్ఱగా బలిసి మసించిన పెదవులు, అవి అతనిచేత కోపం వచ్చినప్పుడు అనేక సార్లు కొరకబడ్డాయి. వాడియై పొడవైన ముక్కు, నున్నని వంకరలు తిరిగిన నల్లని వెంట్రుకలు, అప్పుడే వచ్చి రాని నూనూగు మీసకట్టు. అతని కళ్లు ఎప్పుడూ ఆలోచనలతో చురచుర చూస్తూ ఉంటాయి.

తన అందాన్ని జూసి. తన శీవిని జూసి, తన నవనాగరిక పాశ్చాత్య వేష భాషల్ని జూసి సుశీలతనే తప్పకుండా ప్రేమిస్తుందను

కునే వాడు. నిజంగా తన కీదుష్ట ప్రవర్తన లేకపోతే తననే ప్రేమించే దేమో? తననే ప్రేమించాలనే కుబుద్ధిచేత చిన్ననాటినుంచి తన అన్నతో ఆడుకునే దాన్ని తన దగ్గరకు లాగుకొని గట్టిగా కొట్టేవాడు. సుశీలకు చంద్రుడి చేతి దెబ్బల వల్ల యిప్పటికీ కదుములు పోలేదేమో? ఎటొచ్చీ అవీ తప్పింది యీ మూడేళ్ళ నుంచే. చంద్రుడు వీధిన బడసాగిం తరువాత ఇంట్లో అల్లరి తప్పింది. పోనీ బయట ఎవరయినా స్నేహితులు ఉన్నారా అంటే అదీ లేదు. ఆ గుఱ్ఱము తను, ఆ బలాదూరు తిరుగుడు.

సుశీల అప్సరస. అది ఏక కంఠాన అందరూ అనే మాట. అందులో అబద్ధం లేదు. ఆ సంగతి చంద్రుడికి బాగా తెలుసు. ఇంకో పిల్లను తనకోసం, తన తండ్రి తెచ్చినా ఆమెకు ఎడమ చెయ్యి అని పించుకుంటుండే గాని ఈమెకు చాలటం జరగని పని. ఆమెకు చిన్న బావ అంటే ఎంత అసహ్యమో పెద్దబావ అంటే అంత లక్ష్యం. అందుకు కారణం చంద్రుడే. చంద్రుడు చేసే చిలిపి పనులు, పెట్టే బాధలు మహేంద్రుని ఔదార్య ప్రకటనతో ఆమె హృదయాన్ని మహేంద్రుడిపై లగ్నం చేసినయి. మహేంద్రుడే తనకు సర్వదా రక్ష. అతడే, తన జీవితేశుడు కావాలని ఆమె కోరిక. అందుకనే తన కానాడు ఇచ్చిన అవకాశాన్ని పురస్కరించుకొని ఆ మాటే నలుగురిలో అనేసింది.

చంద్రుడి కది చిన్నతన మనిపించింది. మహేంద్రుడి కది మహోన్నత పదవి అని వేరే చెప్ప నక్కరలేదు. చంద్రుడు విషద్రుక్కులు ప్రసరించాడు. పాముకు పడగ యందు విషముంటే చంద్రుడు ఖలుడు కనుక నిలువెల్ల ఏల యుండదు?

తన నీచత్వాన్ని కాఠిన్యాన్ని దౌర్జన్యాన్ని వివాహ విషయంలో గూడా తలపెట్ట దలచాడు. అవును, నీచులు స్వార్థం కోసం ఏం

చేయరు? ఏం గాదు దుష్ట బుద్ధి చెదురోగ క్రిమి వంటిది. ఇది క్షణంలో ఎన్ని లక్షలుగా నయినా వ్యాపిస్తుంది. దాన్ని అది నాశనం చేసుకోవల సిందే అది ఎట్లా ఉద్భవించేది ఎట్లా నశించేది బ్రహ్మకు కూడా తెలియ దేమో? అది ఎట్లా ఉద్భవిస్తుందో అట్లాగే నశిస్తుంది. దాని జోలికి యితరులు పోగూడదు. ఒక వేళ పోతే వీళ్ళ మీద గూడా విరుచుకు పడుతుంది. దానికి మంచి చెడ్డల విచక్షణ లేదు. బంధు ప్రీతి రానివ్వదు. జ్ఞాన నేత్రం తెరవనివ్వదు. 'క్రోధ మేమిచేయింపదు కుపితు చేత.'

ఏదో పెద్ద ఎత్తే వేస్తున్నాడు, అది పన్నగపు పన్నుగడ కాదు గదా? తన పంతం నెగ్గించుకు తీరాలి; తన కోరిక ఫలించాలి. అంత వరకు అక్కడే తన మకాం!

3

సుశీల పదహారేళ్ళ పడుచు పిల్ల. అసలే ఆమె అందాల రాణి. మనోనాథుడు ప్రణయనాథుడు కాబోతున్నాడు కాయ పండైంది. ఇంకా అంతా తినటానికి అడ్డపెడుతున్నారు. ఆనందం వెల్లువలై పారు తున్నది. ఆమె అందమైన గుండ్రని ముఖం రాకాచంద్రుడితో ఎకసక్కె లాడుతుంది. ఆ మీనులమించు నయనాలు, బలిసిన లేతగులాబి కాంతుల నీనుతున్న కపోలదర్పణాలు; ఆ సున్నని ఎఱ్ఱని చిగురుటంటి కెమ్మోవి: వింటివంటి భ్రువులు; చంద్రవంక వంటి నెన్నుదురు, శంఖాకృతినున్న కంఠ ప్రదేశమందు విధాతచే గీయబడిన మూడు రేఖలు; తుమ్మెద రెక్కలతో సయ్యాటలాడ సమకట్టు తలకట్టు. ఆ వినీల కుంతలములచే నల్లనల్లన అల్లియు అల్లనల్లబడిన ఒదులైన జడ; నువ్వు పూవువలె నున్ననైన నాసిక తామరతూండ్లవంటి బాహువులు; ఒందొంటి నొరసి

కొని రాపిడిచే దినదిన ప్రవర్ధమానమగుచు, సొంపారు లేమావి చిగురు వలె సున్నితమై అనవరతము గోరువెచ్చని స్పర్శగలిగిన బంగారు చాయలీను స్తనములు; రంగారు బంగారు రోమరాజి; యౌవ్వనముచే నెపుడు భర్తృ సంయోగమా యని విరహోత్కంఠతో కుమిలి కృశించు నెన్నడుము. సర్వాంగ సౌష్ఠవము నాకే కలదని, యానందాతిరేకముచే విఱ్ఱవీగుచు విప్పారి విశాలమైన జఘనము; నాకు సిగ్గు. నేనెవరికి గోచరించను అనునట్లు సిగ్గుచే కృంగిపోయి యెక్కడనో దాగికొన్న లోతైన నాభి; గజగమనము. రోజురోజుకు శుక్లపక్ష శశాంకుని కళలవోలె పెళ్లి రోజు సమీపించుచున్నకొలది యతిశయిల్లుచుండెను.

తనబావ తనకు బంగారు కొండ. అసలే ఆ బావను క్రింద నడవనివ్వదు సుశీల. ఎంతమంది ఉన్నా యిప్పుడు మరీ మహేంద్రుడి ఒడిలోంచి కదలదు. మహేంద్రుడు సుశీల కళ్ళకి మన్మధుడు. మహేంద్రుడి కంటికి సుశీల రతీదేవి అటువంటి దాంపత్యం కన్నా కావలసిందేమిటి?

"బావా! యివ్వాళ కోవెలఘట్టానికి షికారు పోదామా!" అంది సుశీల.

"ఏం! యివ్వాళ ఆ కోరిక పుట్టింది?" అన్నాడు మహేంద్రుడు.

"అబ్బ! ఎప్పుడూ యింతే. నేనేదన్నా గుంభనగా ఏమిటో సాహిత్యంలో సమాధానం చెబుతావు."

"నేనేమన్నాను; నీకేమి అర్థం గాకపోయింది?"

"లేకపోతే కోవెలకు వెడదామంటం గూడా కోరికేనా?"

"అది కోరికగాదా?"

"పోనీలే అయితే అయింది. నువ్వు వస్తావా రావా?"

"నువ్వు పొయ్యేదానికి నేనెందుకు?"

"అబ్బ! నీతో మొదటినుంచీ వచ్చిన గొడవే యిది. నేనొక్కదాన్ని పోవాలా? నువ్వు రావాలి!"

"నీతోనూ యిదే గొడవ!"

"ఏంగొడవేం?"

"పెళ్లి కాకమునుపే యిట్లా పీక్కుతినేదానివి అయితే బతకనిస్తావా అని?"

"ఏం చేసినా అంతవరదాకానేగా? అప్పటినుంచీ ఎట్లాగూ నువ్వు చెప్పినట్టు వింటాను. ఇప్పుడు నామాట వినాలి."

"అప్పుడు యిప్పుడు ఎప్పుడు యింతే. నీ పంతమే నెగ్గాలనుకుంటావు. అపుడింకో సాకు చెప్పవు? ఏమైనా అలవాటుపడ్డ ప్రాణం ఊరుకుంటుందా?"

"బండివాడిని పిలవనా?"

"వాడుగూడా ఎందుకు. ఆ కాసేపు నేనే బండివాడినౌతాను."

"అయితే యింకేం దోవకొచ్చావన్న మాట."

"నీ చిలిపితనానికి చంద్రుడైనట్టయితే బాగుండేది."

"ఏమిటి బావా! మరీను. ఎన్నిమాట్లు ఆమాట అనవద్దన్నా మొన్నా అంతే—చేసుకోవటం యిష్టం లేకపోతే" అని కళ్ళనీళ్లు పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది సుశీల.

"ఛా! నిజమనుకున్నావుటే పిచ్చి పిల్ల! నవ్వుతూ అంటే, నిన్ను చేసుకోవటంకన్న నాకు కావలసిందేమిటి"-అంటూ దగ్గిరకు తీసుకుని కళ్ళనీళ్ళు తుడిచి గడ్డం పైకెత్తాడు మహేంద్రుడు. ఏడుపుపోయి ఒక్కమాటు నవ్వింది.

ఆడవాళ్ళకు ఏడుపూ నవ్వూ అంతలోకే రావటం ఎంతో సహజం.

ఇంతలో లోపలినుంచి మహేంద్రుడి తల్లి బయటకు వచ్చింది. "ఏమిట్రా! దాన్ని ఏడిపిస్తున్నావు!" అంది.

"ఏడిపించినా నవ్వించటం చేతనవునుగా అమ్మా! అటువంటప్పుడు ఏడిపిస్తేమటుకేం?" అన్నాడు మహేంద్రుడు తేలికగా.

"బాగానే ఉంది. చంటిదాన్ని పట్టుకుని ఊరికే ఉడికిస్తుంటావు"

"నేనేమన్నానే దాన్ని!"

"చాల్లే ఊరుకోరా! మరీ చిన్నపిల్లవాడివై పోతున్నావు. నిన్న మొన్నటిదాకా చిట్టిమొట్టికాయలతో వాడు దుంపతెంచాడు. వాడు కాస్త వదిలాడుగదా చివాట్లతో యీ మధ్య అనుకుంటే నువుమాత్రం దాన్ని ఉడికించటం మానలేదు."

"మరదలు కాదుటే! దాన్ననకపోతే ఎవర్నంటే ఎవరూరుకుంటారు చెప్పు!"

"అయితే మటుకు! ఏడిపించట మేమిటరా! అదేం ముద్దులు పాడైన ముద్దులు!"

"నన్నేం చేయమన్నావే. అది ఉట్టి పుణ్యానికి ఏడుస్తుంటే!"

"లేదులే అత్తయ్యా! బావ నన్నేం అనలేదులే!" అన్నది సుశీల. కొద్దిగా ఎఱ్ఱవారిన ముఖాన చిరునవ్వు తెచ్చుకుని.

"అసి దీని తస్సదియ్యా! ఇది వాడిని వెనకాలేసుకొస్తున్నదే! వాడేడిపించటం దీని కిష్టమేనన్నమాట! అయినా నాకెందుకొచ్చిన గొడవలే మధ్య. అది సరేగాని ఎక్కడికే అమ్మాయి ముస్తాబై బయల్దేరావు?" అంది మహేంద్రుడి తల్లి.

"నువ్వు ఊఁ అంటే చెబుతా!" అంటూ సుశీల అత్తయ్య భుజాలు పట్టుకున్నది.

"పిచ్చి తల్లి! మీ యిష్టం ఎప్పుడు కాదన్నాను?"

"బావా నేను కోవెలకు పోతున్నాం."

"బాగానే ఉంది. వీడింకా వేషం వెయ్యలేదే!"

"అదే అత్తయ్యా! అడుగుతున్నా!"

"సాగదియ్యాలిసొచ్చిందా?"

ఔనన్నట్టు అదోరకంగా తల ఊఁపింది సుశీల. అట్లా తల ఊఁపటంలో ఆమెకు ఆమే సాటి.

ఇంతలో మహేంద్రుడు అందుకుని "లేదమ్మా. నేను సిద్ధంగానే ఉన్నాను" అంటూ లోపలికి వెళ్లి చక్కని సిల్కు బట్టలు వేసుకుని సిద్ధంచేసి ఉన్న బండి మీద ఎక్కి ఇద్దరు వెళ్లిపోయారు.

౪

బండి వీధులవెంట పోతున్నది. వాళ్లిద్దరు అట్లా బండిలో పోవటం వింతా గాదు, క్రొత్తా గాదు. అయితే యిపుడు బయలుదేరటంలో వింత లేకపోలేదు. ఆరునెలల యీ మధ్య అట్లా వాళ్ళు బండి మీద పోలేదు. అదివరకు రోజూ బండిమీద కోవెలకు పోవటం పరిపాటే. అనేక మంది ఆ బండిని. కాబోయే వధూవరులను ఆనందంతో తిలకిస్తున్నారు. యాభై ఏళ్ళున్న ఒక యింటి యజమాని బండికి అడ్డం వచ్చి గుఱ్ఱం కళ్లెం పట్టుకుని ఆపాడు. మహేంద్రుడు లోపల సుశీల

ప్రక్కన కూర్చుని తోలటంవల్ల గుఱ్ఱం మెల్లగా పోవటంలో అది వెంటనే ఆగిపోయింది. ఆయన ఆ ఊళ్ళో పెద్ద ధనవంతులలో ఒకడు వాళ్ళకు కావలసిన దూరపు బంధువు. వాళ్ళిద్దరిని లోపలికి తీసికెళ్ళాడు. ఆయన భార్య కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు తెచ్చింది. ఫలహారాలు పట్టుకు వచ్చింది.

"ఏమిటి బాబాయి! ఇదంతా?" అన్నాడు మహేంద్రుడు ఆశ్చర్య పోతూ.

"ఏమిలేదు నాయనా! నా సంతోషం. ఇవ్వాళే విన్నాను చల్లని వార్త. చిలకాగోరింకల్లా గుంటారు. అమ్మాయి బంగారు బొమ్మ. మీరు చల్లగా ఉంటే అదే మాకు పదివేలు" అని ఆనందం పట్టలేకపోతున్నాడా వృద్ధుడు.

"ఇవిగో వదినా" అంటూ యిన్ని గులాబిపూలు తెచ్చి యిచ్చింది ఆ యింటి యజమాని కూతురు సుశీలకు. సుశీల వాటిని అక్కడే దండలు కట్టి ఆ పిల్లకు, ఆ పిల్ల తల్లికి రెండు యిచ్చి తానొకటి పెట్టుకుని. రెండు చేత పుచ్చుకుంది తన తల్లికి, మహేంద్రుడి తల్లికి.

ఆ యింటి యజమాని వద్ద సెలవు తీసుకు మళ్ళీ బండి మీద బయలుదేరారు. మహేంద్రుడింటికి కోవెలకు అరమైలుదూరం ఉంటుంది. వీధి రెండు వైపుల మేడలు. పెంకుటిళ్లు, ఎఱ్ఱమన్ను పట్టెలు తీర్చిదిద్దిన పాటిమట్టి గోడలు ఎంతో సుందరంగా కనుపిస్తున్నయి. అంతదూరాన చంద్రుడు గుఱ్ఱంమీద రావడం మహేంద్రుడు కనిపెట్టాడు. బండి ఆగింది. అది చంద్రుడు కనిపెట్టలేదు. గుఱ్ఱం దగ్గరకు వచ్చింది. చంద్రుడు తలెత్తి చూశాడు. బండిలోంచి మెరుపుతీగె మెరిసినట్లయింది చంద్రుడికి. తన కళ్ల తానే నమ్మలేకపోయాడు. నాటి సుశీల అచ్చంగా నాకలోకం

లోంచి ఊడిపడ్డ అచ్చరాంగన లాగుంది. ఆమెను రెప్ప వాల్చకుండా చూశాడు. కన్ను మరల్చి అన్నవేపు జూశాడు. మహేంద్రుడు గూడా ఆనాడు వేసిన వేషం ఎన్నడూ వేయలేదు. ఆ దృశ్యం అతనికి ఆశ్చర్యంగా కనిపించింది. అన్న ప్రక్కన సుశీల కూర్చుని షికారుకి వెళ్ళటం క్రొత్తగాదు గాని నాటి యీ ప్రత్యేక శృంగార కళ మాత్రం అతన్ని స్తబ్ధున్ని జేసింది.

తమ్ముడూ!—అన్నాడు అన్న.

చంద్రుడు కన్నెత్తి చూసి గుఱ్ఱాన్ని దౌడు దీయించాడు. తమ్ముడి ఆ అవిధేయతకు అన్న నొచ్చుకొనటానికి అది ప్రథమతఫా గాదుగదా? అది ఆ అన్నదమ్ములకు పరిపాటే.

ఆనాటి చంద్రుడి చూపులకు సుశీలకు భయం వేసింది. గట్టిగా బావను పట్టుకుంది. మహేంద్రుడు చిరునవ్వు నవ్వాడు. సుశీల దాన్ని అందుకోలేక అర్థంగాక అట్లాగే బిక్కమొగం వేసుకొని చూస్తున్నది. సుశీల కానాడు ఎందుకు బయలుదేరామా అనిపించింది.

కోవెల ఘట్టం సమీపించింది. ఇద్దరూ బండి దిగారు. సుశీలను మహేంద్రుడు చెయ్యిపట్టుకుని దింపాడు. సుశీల పూర్తిగా అతడి మీద వొరిగిపోయింది. ఆమెభారాన్నంతా మోస్తూనే క్రిందికి దింపాడు మహేంద్రుడు. తన ముఖాన్ని అతని భుజంమీద ఆనించింది, సుశీల.

"సుశీలా! సుశీలా!! ఏమిటిదిపిచ్చి! అట్లా భయపడ్డావేం? వాడేం మనిషికాదనుకున్నావా?" అన్నాడు మహేంద్రుడు ఆమె ముఖంలోకి చూస్తూ.

సుశీల ఉలిక్కిపడి లేచింది.

"బావా! నాకేదో భయంగా ఉంది. మళ్ళీ యింటికి పోదామా?"

''పోదాంలే తొందరేం? అప్పుడేనా రావటం పోవటం?''

"లేదుబావా!"

''ఫరవాలేదులే! నే లేను''! అంటూనే మహేంద్రుడు ఆమె తన మీద ఆధారంగా సెలయేటి ఒడ్డు పచ్చిక మీద కూర్చోబెట్టాడు. ఆమె కళ్ళు విప్పనేలేదు. నీళ్ళతో ముఖం తుడిచాడు. కాసిని నీళ్ళు పట్టాడు. ఆ నీళ్ళు తాగిం తరువాత సుశీల కొంచెం తేరుకుని కళ్లు విప్పింది. బావా! అంటూ మహేంద్రుడి వడిలో వాలిపోయింది. అతడిని గట్టిగా కౌగిలించు కుంది మహేంద్రుడు ఆమె శిరోజాలని మెల్లిగా నవరిస్తూ ఓదార్చాడు.

అప్పుడు రవి అస్తగిరి నందుకున్నాడు. అక్కడి సాయం సంధ్య కడు రమణీయమైంది. పచ్చటి కొండలు ఎఱ్ఱవారి ఉన్నాయి. ఆ ప్రదేశం నిరామయంగా ఉంది. అక్కడ ఒక లేడి ఒక జింక తిరుగుతున్నాయి. వాటికి మానవభీతి లేదు. అక్కడ ఆడునెమలి మగనెమలి ఉండేవి. మగ నెమలి చచ్చిపోయింది. అది ఫించము విప్పి ఆడినపుడు ఆ ఊరి జనం విరగబడి చూసేవారు. ఎప్పుడోగాని అది సాధారణంగా నిర్జనంగానే ఉంటుంది. రాత్రిళ్ళ విషయం చెప్పనే అక్కరలేదు. చంద్రుడి కది నిరంత రాలవాలం.

సుశీల కొంచెం తేరుకుంది. అప్పుడు అక్కడ ఎవరూ లేరు.

"బావా! నన్ను నీవు తప్పక రక్షించగలవా?" అంది సుశీల దిగులుగా.

"ఎందుకు సుశీలా నీకా అనుమానం. ఇప్పుడు నీకు వచ్చిన ఆపద ఏమిటి, నేను రక్షించందేమిటి?''

"నీకంత శక్తి ఉందో లేదో అని?"

''నాబలం చూస్తావా? ఇదిగో చూడు.'' అని మహేంద్రుడు

సుశీలను గట్టిగా తనకేసి అదుముకుని ఆమె ముఖం మీద తన ముఖం ఆనించబోయాడు. సుశీల ఆ వదనకమలాన్ని తన కరమలంచేత వారించింది. దానికి ఆమె ఉక్కిరి బిక్కిరి అయిపోయింది.

"చాలు బావా! చాలు! అబ్బ! బలం చూపించేదిట్లాగా?"

"మరి నన్నేం చేయమన్నావు. ఇంకెట్లా చూపించాలి? నాకింకో మార్గం తోచలేదు. అయినా నీకు వచ్చిన భయం లేదు. నీ మీదికి వస్తే ముందు నాప్రాణాన్నర్పిస్తాను. నా ప్రాణం ఉండగా నీకు ఆపద రానివ్వను. ఇక నీకు భయమెందుకు. అయినా చంద్రుడ్ని చూస్తే భయమెందుకు? చిన్న నాటి నుండి వాడ్ని ఎరుగవా? వాడేం కొత్తగా వచ్చాడా?"

"లేదుబావా! యివ్వాళ చిన్నబావ చూసినప్పుడు భయం వేసింది. అయినా నీకు ఆయనకు చాలా వారుంది. నీ శరీరం ముందు, బలం ముందు ఆయనెక్కడ. పోట్లాటకు నీతో ఎదురుగా రాలేదు గాని దొంగ చాటుగా ఏమైనా చేస్తాడేమోనని?"

"పిచ్చిదానా! వాడెందుకొస్తాడే నా జోలికి? అయినా వాడెంత హడావిడి మనిషో అంత భయస్తుడు."

"పోనీ అది సరే గాని—మనపెళ్ళెపుడు నిశ్చయించారు బావా?

"వచ్చే వారం యిదేరోజు."

"చిన్నబావకు కూడా ఎక్కడైనా మంచి పిల్లను చూసి పెళ్ళి చేయకూడదా?"

"లేదు సుశీలా! నాన్నకు అది యిష్టంలేదు. పెళ్ళంటే మాటలనుకున్నావా? నూరేళ్ళ పంట. భార్యాభర్తలు ఎంతో కుశలబుద్ధులు కావాలి. ఇద్దరూ అన్యోన్యంగా పడుదుడుకులు లేకుండా వివేకవంతులై ఉంటే

గాని సంసారమనే బండి సాఫీగా సాగిపోదు. లేకపోతే అవకతవకలు తప్పవు. ఇద్దరికి పరిపూర్ణ వ్యక్తిత్వం రావాలి. ఆడది కొంతవరకు అమాయకురాలైనా పరవాలేదుగాని మగవాడు అమాయకుడైనా, తుంటరి, తిరుగుబోతూ అయినా ఆ ఆడది నానాగడ్డి కరవవలసిందే. ఆ సంసారంలో వేరే ఒకరు చిచ్చుపెట్ట నక్కరలేదు. ప్రతి ఆడది అందమైన వాడు, యోగ్యుడు, ప్రయోజకుడు అయిన భర్తనే చేసుకొని, కలకాలం సుఖజీవనం వెళ్ళబోయాలనే చూస్తుంది. ఆమెను గన్నవారు వాళ్ళ సౌఖ్యాన్నే కాంక్షిస్తారు. నీవు చంద్రుకిని చేసుకోవటానికి ఎందుకు ఒప్పుకోలేదు? అందుకే ప్రతివాళ్ళు పిల్లనివ్వటానికి వెనకాడతారు. నిర్భాగ్యుడు, అయోగ్యుడు, అప్రయోజకుడు, అనామకుడు అయినవాడిని కట్టుకొని జీవితమంతా కళ్ళ నీళ్ళు కారుస్తూ, వస్తులు పడుకోటానికి ఏ ఆడదీ అంగీకరించదు. అటువంటి వాడికి మన మొక భార్యను కట్టడం దాని గొంతు కోయటం, నాన్న కిష్టం లేదు. అసలు వీడిట్లా ఎందుకైపోయినాడో ఏనరికీ అర్థం కావటం లేదు."

"పోనీ పెళ్ళిచేస్తే కుదురుతుందేమో?"

"లాభం లేదు. దానంతట అది తగ్గవలసిందే. ఏదైనా చెడు రానేకూడదు. ఎవరినోరు మూస్తాం."

"పోదామా బావా! పొద్దుపోతున్నది."

"పద"—అంటూ లేచాడు మహేంద్రుడు. ఎదురుగా చంద్రుడు మెల్లగా వస్తున్నాడు. మహేంద్రుడదది జూసి మాట్లాడిద్దామని చరచరా ముందుకు పోయినాడు. చంద్రుకి చెయిపట్టుకున్నాడు మహేంద్రుడు. తలెత్తి అన్నను చూసి గబగబ వెనక్కుపోయి గుఱ్ఱాన్నెక్కి దౌడు తీశాడు.

''పలకటానికే ఆయనకంత కష్టంగా ఉంటే ఆయన్నెందుకు కట్టా పట్టుకుంటావు బావా! ఆ మనిషి తీరది.'' అన్నది సుశీల బరువెక్కిన హృదయంతో.

"కాదు సుశీలా! నామనస్సు వాడిట్లా చెడిపోవటం సహించదు. వాడు బాగుపడి సుఖపడతాడా అని నా భయం." మహేంద్రుడి హృదయం తల్లడిల్లిపోయింది.

బాగా చీకటి పడింది. నిశి సాంద్రంగా ఉంది. ఒకరినొకరు కన్ను కన్ను పొడుచుకున్నా కనుపించటంలేదు. చంద్రుడు మళ్ళీ కోవెలను చేరుకున్నాడు. చేతిలో ద్రాక్షగుత్తి ఏడెనిమిది చక్కెర కేళీలు ఇంకేవో రెండు పళ్ళు ఉన్నయి. పెలయేటి ఒడ్డున ఆశీనుడయ్యాడు. క్రమంగా వాటిని తినటం ఆరంభించాడు. ఈ విధంగా సుమారొక గంట కాలం పటింది. ఇంకా రెండు చక్కెర కేళీలు ఒక పండు మిగిలినయి. ప్రక్కన ఉన్న ఆ తియ్యటి అమృతాన్ని పానం జేశాడు. కడుపు నర్దుకున్నాడు. ఏమీ తోచక అటూ ఇటూ కలయ జూశాడు. పక్షుల కలకలారావం వినుగు లేకుండా వినిపిస్తున్నది. ఎటు చూసినా చీకటి తప్ప ఏమీ కనుపించదు. అప్పుడప్పుడు కుందేళ్ళ చప్పుడు కూడా వినిపిస్తున్నది. ఊరికి కొన్త దూరంగా ఉండటంచేత అది అడివి ప్రాంతంగా కనుపిస్తుంది. చంద్రుడు లేచాడు. నలుమూలలా కలియదిరిగాడు. ఒక చెట్టు కొమ్మ వంచి చిన్న మండను విరగదీశాడు. పక్షులు తమకేమైనా అపద మూడుతున్నదేమోనని బిగ్గరగా ధ్వనిచేసినయి. ఆకొమ్మ ఒక లేత మండ. దాని ఆకులు చంద్రుడు దూశాడు. అది చువ్వవలె పనంద్రైన బెత్తమైంది.

దాన్ని రెండుసార్లు ఫస్ ఫస్ మనేట్టు ఘోషించి ధ్వని చేశాడు. కుందేళ్ళ కదలికకు ఆకుల చప్పుడైంది.

చంద్రుడు బహూ మొండిపట్టు మనిషి. అందుకనే ఆ రాత్రి అక్కడే నిర్భయంగా కాలక్షేపం వెళ్ళబుచ్చటానికి నిశ్చయించాడు. అక్కడ నుంచి కోవెల మంటపం ఎక్కాడు. విఘ్నేశ్వరుడు ప్రశాంతంగా తనతో మాట్లాడకుండా మూర్ధనుడికిమల్లే ఉన్నతాసనంలో మధ్య కూర్చున్నట్లనిపించింది. ఔను! అయనబోటి బ్రహ్మచారి యిటువంటి కామాంధచిత్తులతో ఎట్లా మాట్లాడుతాడు.? కోపంతోనే భీష్మించుకుని కూర్చున్నాడు. అదిచూసి ఎందుకో చంద్రుడు నవ్వుకున్నాడు. వినాయకుడ్ని జూసి చంద్రుడు నవ్వటం సహజమేగా. అయన శపించేవాడే. కాని చంద్రుడతని దృష్టి కానలేదు. మొండి బ్రహ్మచారి. పెళ్ళా పెటాకులా? ఎందుకయ్యా నీకీ వైరాగ్యం? హాయిగా పెళ్ళి చేసుకుని భార్యతో కాపురం చేయకుండా? అదుగో, ఆ హాయిగా అనే దానిలోనే ఉంది ఉన్నదంతా. ఆ హాయిగా కాపురం చేయక అన్న విషయం కాకపోతే నిజంగా వివాహం చేసుకోవచ్చు. హాయిగా అన్నది ఎన్ని అనుకూల పరిస్థితులలో సానుకూలమయ్యేది గుర్తించారా? అట్లా అందరికీ సాధ్యం కాదు. గనుక 'చిన్న నా పొట్టకు శ్రీరామరక్ష' అంటూ కొంతమంది దేవుళ్ళీ వివాహంమీద విరక్తి పుట్టినా, నామక: వివాహమైనా, సంసారాన్ని త్యజించారు. ఎక్కడో కూర్చుని ముక్కు మూసుకొని కృష్ణా రామా అనుకోకుండా ఎందుకొచ్చింది యీ బెడద.

వినాయకుడి కిరీటంమీద చెయివేసి వ్రేళ్ళతో త్రిప్పాడు. ఇంతలో అతని దృష్టి కొండమీద పడింది. సెలయేటి ద్వారంపైకి మెల్లగా నడచిపోయాడు. అక్కడ తిన్నెపై కూర్చున్నాడు. ఆకాశం వైపు చూశాడు నిరాశగా. చీకటి మధ్య మధ్య నక్షత్రాలు మాత్రం కనిపిస్తున్నయి.

మెల్లగా నడిచి కొండ కొనకు వెళ్ళాడు. అప్పుడు వెన్నెల వచ్చింది. ఆ వెన్నెల కాంతిలో ఆ పెద్ద గ్రామాన్నంతా కలయజూశాడు. అది రాత్రి ఎంతో మనోహరంగా ఉంది. అరమైలు దూరంలో ఉన్న తమ గృహం కూడా ఆ కాంతిలో సుస్పష్టంగా కనుపిస్తున్నది. పాము మెలికలవలె క్రమబద్ధంలేని వీధులు, అక్కడక్కడ మేడలు. మధ్య మధ్య విశాలమైన భవంతులు. చెట్ల చాటున కనుపిస్తున్నాయి. తమ యింటికి మాత్రం ఏచెట్టు అడ్డంలేకపోవడంలో సుస్పష్టంగానే కానవస్తున్నది. ఇండ్ల సందుల నుంచి సన్నని దీపకాంతులు మిణుక్కు మిణుక్కు మంటున్నాయి. తెల్లని ఆవులు, ఎడ్లు, నల్లనిగేదెలు, దున్నలు మేతలు మేస్తున్న చాయలు గూడా కానవస్తున్నాయి. వీరి యిల్లు ఊరికి పడమర చివర ఉంది. అందులోను జానకిరామయ్య యిల్లు కట్టకడపట. దాని ప్రక్కనే ఉత్తరానికి పోయేడొంక ఉంది. ఆడొంక కిరువైపులా తాటిచెట్లు. యీతబొత్తలు, ముండ్ల పొదలు, విరివిగా ఉంటాయి. ఆ మార్గమందు పగలే అంతగా జనసంచారం ఉండదు. అది ఒకప్పుడు యేటికి పోయే మార్గం. ఇప్పుడు ఇంకొక దోవన పోవటంవల్ల ఆ డొంక పూర్తిగా పాడుబడ్డట్లయిపోయింది. అదంతా రాత్రిపూట కీచుమంటూ అడవిగా ఉంటుంది. అయినా దానికి జానకిరామయ్య యింటివాళ్ళు బాగా అలవాటు పడ్డారు. ఏమైనా వారి యింటికి దొంగభయం లేదు.

చంద్రుడు తిరోగమనాన్ని పట్టాడు. ఆకాశంలో చంద్రుని తెల్లని కాంతులవల్ల ఆ కొండ ప్రదేశమంతా పిండారబోసినట్లుంది. ఆ వెన్నెలలో తన నీడ సుస్పష్టంగా కానవస్తున్నది. అదొక్కటే తన కప్పుడు తోడు నీడ. మెల్లగా నడక సాగించాడు. క్రింద వైపు మెల్లగా పచ్చిక మేస్తున్న తన సుందర శ్వేతాశ్వం నల్లని యలంకరణములతో కనుపించింది. అదే తనకు సర్వదా శరణ్యం. దిగివచ్చాడు. అశ్వం అతన్ని

జూసి పచ్చిక కొరకటం ఆపేసింది. చంద్రుడు దాని మెడను ఆప్యా యంగా కౌగలించుకొని మెడ జూలు నిపురుతూ మెడమీద రెండు చిన్న చరుపులు చరిచాడు. దానికి వళ్ళు పులకరించింది. ఒకమాటు సకిలిం చింది చంద్రుడివైపు చూస్తూ. చంద్రుడు ఏమీ లేదన్నట్టు చూసి వెనక్కు తిరిగాడు. మరొకమారు చూపు సారించి అశ్వం పచ్చిక తిరిగి కొరకడం ప్రారంభించింది.

కొలనిలో అతనికేదో తాయం దొరికినట్లయింది. దగ్గరకు పోయి నాడు అందులో అతనికి ఒకమామ తనకు తోడుగా కనుపించాడు. అతడే చందమామ, అందాల చంద్రుడు. నిశాధిపతి, ఉడురాజు ఒక నిమిషం చూసాడు. ఇక చూడలేకపోయాడు. అతడే రాజు, మన్మథ ప్రేరేపకులలో ముఖ్యుడు. చంద్రుడి హృదయంలో ఏదో గుబులుగా రేకె త్తింది. ఆ చంద్రుడి బింబంలో సాయంత్రం బండిలోని శృంగార సుశీల ముద్దుమోము నవ్వుతూ కనుపించింది. మళ్ళీ చంద్రుడిని చూడగానే ఆ ఎఱ్ఱ తామర ముకుళించింది. చంద్రుడికి పట్టలేనంత ఆగ్రహం వచ్చింది. తన చేతిలో బెత్తం ఉండగా జుట్టి అందులోకి విసరికొట్టాడు. నీరు అలజుగా చెదరిపోయింది. తిరిగి అలలు సర్దుకుని యథాతథంగా చుక్కలరాయుడు సాక్షాత్కరించాడు. చంద్రుడికి మళ్ళీ కన్నెఱ్ఱనయింది. కాని దైవకృప వల్ల సన్నని మబ్బు తెప్పర ఆ రేరాజుని తన కౌగిటిలో చేర్చుకుని చంద్రుడి బారి నుంచి తప్పించింది. అపుడు చంద్రుడి కళ్ళు చల్లబడ్డయి. తన ప్రత్యర్థిని చంద్రుడు చూడలేకపోయాడు. నిశారాజు తనపై నవాలు చేస్తున్నాడని భ్రమపడి అతని మీద పగ సాధించ బోయాడు. అతడిప్పుడు లేడు. తను మళ్ళీ దారి మరలించాడు. కాని అక్కడి చంద్రుడు అప్పుడే పోతాడా? అతడు తిరిగి తన స్థానాన్నలంక రించాడు. అది చంద్రుడు చూడరాదు.

వచ్చి సెలయేటి ఒడ్డుపై విశ్రమించాడు. అప్పటికే అర్ధరాత్రి బాగా తిరిగిపోయింది. అక్కడ పడిఉన్న పళ్ళు కనుపించినయి అవి తిన్నాడు. మంచినీళ్ళు త్రాగాడు. అప్పటికీ ఆలోచనలు అలసిపోయినయి. దేనికైనా చరమదశ అంటూఉంటుందిగా. ఒక చిన్న ఆవలింత వచ్చింది. ఆ లేపచ్చిక పట్టుపరుపులను మించటంచేత, వెంటనే కునుకుపట్టింది. చంద్రుడు వళ్ళుమరిచి నిద్రపోయినాడు. అక్కడి పక్షులు జంతువులు భీతిమాని స్వకార్యములందు నిమగ్నమైనయి కమ్మని పిల్ల తెమ్మెరలచే నారేయి ప్రశాంతంగా, మనోజ్ఞంగా గడచిపోయింది.

౬

ప్రభాతవేళ సమీపిస్తున్నది. ఊరిలోని నిత్యకలకలం నిరాఘాటంగా సాగిపోతున్నది. ఇంకా మసకచీకటిగా ఉంది. దూరాన్నించి ఎవరో తంబూరా మీటుతూ సన్నని కంఠంతో ఎలుగెత్తి కమ్మగా ఆలాపిస్తున్నారు. ఆ నాదం ఆకాశంలో కలిసిపోతున్నది. అందులోని శబ్దజాలం యిట్లా ఉంది.

ఈశ్వర చింతేరా! - మన కీశ్వర చింతేరా!
జీవిత జలధిని దాటగ - మూల సాధనము ॥ ఈ ॥
అదితెలియక - మద మత్సరములతో
మాయజలధిని - మునిగి తేలుటకన్న
అవివేకము - అవ్యక్తము - వేరొకటుండున ॥ ఈ ॥
కలిగినవాడూ - కాయము దెలియక
వెట్టి మొట్టి - వింతపోకిళ్ళతో
జీవితమును - వృధ గడుపగనేల ॥ ఈ ॥

నీతి ధర్మం - సత్యం శౌచం
జగతిని నిత్యమురా; - కలిగిన సత్యమురా। ॥ ఈ ॥
వింతవాదమూ - వితండవాదము
మానుమురా - సుఖపడరా।
విలకడ జీవితమే - కర్తవ్యమురా।
మఱువకురా। - అంతా - మా - యరా ॥ ఈ ॥

అతడే ఎలుక రామానుజయ్య. ఎలుకసింగరయ్య వంశములో ప్రస్తుతమున్న మూషికార్చకుడు. ప్రతిరోజూ ఉదయం తెల్లవారకమునుపే అక్కడికి వచ్చి ఆ క్రిందటి రోజు భిక్షాటన జేసి తెచ్చిన ధాన్యం నైవేద్యం పెట్టి యింట్లో యిచ్చి తిరిగి పెమెత్తటానికి పోతాడు. అది ఆ యింటివారి నిత్యకృత్యాచారం. ఆ ఆచారానుసారంగా ఉదయ సంధ్యా రంగంలో తన రాగాలాపాన్ని మిళితం జేస్తూ అక్కడికి వస్తున్నాడు. అతడు చాల నిరాడంబరజీవి. పిల్లలు కలవాడు. ఆ ఎలుకరాజు ధర్మాన ఆ యింట ఎన్నడూ అన్నపూర్ణ కొరతలేదు. రామానుజయ్య ఆ ఊళ్ళో చక్కని గాయకుడని ప్రతీతి. దైవసంకీర్తనంలో దిట్ట. ఒంటినిండ ఆ పట్టెవర్ధనములు. చేతిలో చిడతలు, నెత్తిన అక్షయపాత్ర, ఇంకొక చేత తంబూరా. కాలిగజ్జలు ఘల్లు ఘల్లు మంటూ 'హరిలోరంగ హరీ' అంటూ చిందులు త్రొక్కుతున్న ఆ అనవరత హరిపదాంబుజధ్యాన పరైకచిత్తుడైన రామానుజయ్యను చూసినప్పుడల్లా నిత్యము సంక్రాంతి పండుగే అవుతుంది. రాగధ్వని ఆకాశంలో లీనమౌతూ దగ్గరకు వచ్చిన కొలది కంఠం సన్నగిల్లుతున్నది. ఆలాపన క్రమేణా ఆగిపోయింది. కొంత ఎగువపై రామానుజయ్య సాక్షాత్కరించాడు.

రామానుజయ్య నేరుగాపోయి ఎలుకస్వామి నారాధించి మరల తంబూరా మీటుతూ బయలుదేరాడు. అతని దృష్టి ఆ ప్రక్కనే కొంత దూరాన పచ్చికపై విశ్రమించిన చిన్నబాబుమీద పడ్డది.

"చినబాబుగారా! ఏమిటీ అవస్థ? గొప్పింట బుట్టి మహారాజువలె పెరుగుతూ యీ రాత్రి యీ అడివి ప్రదేశంలోనా నిర్భాగ్యునివలె నిద్ర పోవడం! అయ్యో! ఏంఖర్మమొచ్చిందిబాబూ!—" అంటూ లేవబోయి అసలు యింట్లో కోపంవచ్చి యిక్కడికి వచ్చాడేమో లేపకుండా ఉంటే యిక్కడే నిద్రబోతుంటాడు. ఈ లోపల తండ్రిగారితో జెప్పితే వారే వచ్చి పిలుచుకుపోతారు. లేపితే యిక్కడి నుంచి కూడా పోతాడేమో- అనే దూరాలోచనతో త్వరితగతిన బయలుదేరాడు రామానుజయ్య. ఆ విషయం రంగిధామయ్యగారితో చెప్పటానికి.

కరకర ప్రొద్దెక్కుతున్నది. సూర్య కిరణాలు చంద్రుని ముఖం మీద సాంద్రంగా పడుతున్నయి. మెల్లగా లేచాడు చంద్రుడు. ముఖం ముకుళించింది. కన్నులెఱ్ఱవారినయి. రాత్రి ఆ అసంపూర్తి అర్ధనిద్రకు చాలా బద్ధకంగా ఉన్నాడు చంద్రుడు. ఒళ్ళు విరుచుకున్నాడు. చేతులు కాళ్ళు విధిలించాడు కాలిబూట్లు విప్పాడు లేచి అక్కడ ఉన్న ఒక వేపచెట్టు పుల్ల విరిచాడు. అది నములుతూ మంటపం అరుగుమీద కూర్చు న్నాడు. ఆ సెలయేటి నీళ్ళతో ముఖం కాళ్లు కడుక్కొని మళ్ళీ బూట్లు తొడుక్కున్నాడు. ఎదురుగా అతని గుఱ్ఱం నడిచివస్తున్నది. అది ఎక్కి బాలచంద్రుడు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

౨

అప్పుడే రంగధామయ్యగారి యింట్లో కాలకృత్యాలు తీర్చుకుంటు న్నారు. రంగధామయ్య, జానకిరామయ్య కాబోయే వియ్యంకులు. వారి ద్దరు చెరొక ప్రక్క అరుగుమీద కూర్చుని ముఖం తోముకుంటున్నారు. ఎవరో పాలేరుతో వాళ్ళు మాట్లాడుతున్నారు పొలాల విషయం. వారి ప క్కనే సోఫాలో మహేంద్రుడు మేలయిన దుస్తులు వేసికొని మహాకవి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి మా బాబు నవల చదువు తున్నాడు. అది ఆయన అభిమాన ప్రత్యేక నవల, ఎవరైన దాని విషయం

ఎత్తితే ఆ నవల గురించి. విశ్వనాథవారి గురించి అనన్యంగా ఆహార నిద్రలు లేకుండా రోజులకొద్ది మాట్లాడుతారు.

మహేంద్రుడు అప్పుడే కాలకృత్యాలు తీర్చుకోవటం. తేలిక పదార్థం అవుపాలు స్వీకరించటం కూడా అయిపోయింది. ఆయన ఉద యాన్నే అప్పుడు పిండిన ఆవుపాలు త్రాగే అలవాటు. వజ్ర శరీరుడు. నిత్యం వ్యాయామం చేస్తాడు. చంద్రుడంత పొడగరి కాకపోయినా దీర్ఘ కాయుడే. ఎత్తుని కండలుదేరిన శరీరం ఇరువది యేళ్ళ ప్రాయం. అప్పుడే వస్తున్న కోర మీసకట్టు. బంగారురంగు లీనుతూ అక్కడక్కడా ఉంగ రాలు తిరిగిన గడ్డముమీది వెంట్రుకలు సరియైన యవ్వన లక్షణాల్ని తీర్చిదిద్దుతున్నది. కోటేరు వేసినట్లు ముక్కు. గుండ్రని ముఖం. చక్ర ములవలె చివరలు ఎత్తువారిన కళ్ళు. విశాల ఫాల ప్రదేశము. వంకులు దిరిగిన నల్లనిజుట్టు ఆముఖానికెంతో అందాని చేకూరుస్తాయి మహేంద్రుడు చంద్రునివలె వలుచనివాడు గాదు. బలిష్ఠమై గడితీరిన కర్షకుడు. ఇరువై ఏళ్ళకే ఇరువదియైదేళ్ళ వానివోలె కనుపిసాడు. అతని కప్పుడప్పుడు నాగలి పట్టటం ఎంతో సరదా. బుద్ధి కౌశల్యం గలవాడు. అందతడు నేర్పరి. అందతడు ఓరిమిగల నేర్పరియైన తీర్పరియని గణుతికెక్కాడు. రంగధామయ్య వంటి పెద్దమనిషి కూడా అనేక విషయాలలో యీ పెద్ద కొడుకు సలహా పాటిస్తాడు. అందుకనే ఆ పెద్దకొడుకంటే ఆయనకు మేరుపర్వతం దిగివచ్చినట్లుగా ఉంటుంది. అటువంటి ప్రతిభ మహేం ద్రుడి ప్రసన్న వదనంలోనే ఉంది. అతనికి ఎప్పుడూ తమ్ముడు తనతో మాట్లాడాలని కోరిక. తమ్ముడిని చూడనిదే అతడొక క్షణం గూడా ఉండలేడు. ఎంత అగం జరిగినా తమ్ముడు తన బంతిన కూర్చొని భోజనం చేయాలి. ఆ విషయంలో అనేకసార్లు తన తండ్రి పంక్తికి పోవడానికి గూడా నిరాకరించాడు. ఆరోజు చంద్రుడింటికి రానందుకు

మహేంద్రుడెంతగా కుందుతున్నాడో ఆ ఉపేంద్రేదికే తెలియాలి.

ఇంతలో అన్ని మాటలు మాట్లాడి ఆ వచ్చిన రైతు వెళ్లి పోయాడు.

"అయితే బావా! రాత్రి చిన్నవాడు ఇంటికి రానేలేదా?" అంటూ యింటి గొడవలో బడ్డాడు జానకిరామయ్య.

"వాడికిల్లెందుకు, వాకిలెందుకు ?" అన్నాడు రంగథామయ్య చుట్ట పొగవిడుస్తూ.

"చూడు బావా! వాడి విషయంలో నీకీ నిర్లక్ష్యభావం బాగుండ లేదు."

"అంటే ఏం చేయమన్నావు?"

"ఎక్కడుండీ, ఎమయిందీ కాస్త వెతికించి తెలుసుకోవాలా అక్కర లేదా?"

"చాల్లే! వాడేం ఆడపిల్లా వెతికించటానికి? కాలుగల మగబిడ్డ. ఆ కాలుతీట పదిలేంతవరకు వాడే తిరుగుతాడు దానికి బలపాలు కడితే వాడే కుక్కలె కొంప జేరతాడు. అదేగా ప్రయోజకత్వం! ధీమా!"

"అట్లా అని ఊరుకోవలసిందేనా?"

"ఊరుకోక చేసేదేముంది? ఉరిబెట్టుకుంటామా? రోగం కుదిరే విధంగా కుదరాలి. అంతవరకు ఏ మందిచ్చినా పంటబట్టదు. అదేదో తేలాలి. అనుభవం మీదగాన తెలిసిరాదు. కాలో చెయ్యో విరిగితే వాడే వస్తాడు దారికి."

"బాగానే ఉంది. పెద్దవాడివి మంచిదీవనలే. తండ్రినోటి మీదుగా ఏంమాటలివి.?"

"అవునయ్యా! ఇందులో ఏమీ తప్పులేదు. వాడేం అదుపులో పెడితే ఆగేవాడా ఏమన్నానా? నేనేం ఆమాత్రం చేతగాక ఊరుకోలేదు.

నాకూ తెలుసు అదుపులో పెట్టుకునే మార్గం. ఆ మార్గాలవలన ప్రయోజనం ఏమిటి? అందులో మనం ఎంతవరకు నెగ్గుతామో ఆలోచించాలిగా. ఇటువంటి వాళ్ళకు మంచి నేర్పటం చెవిటివాడి ముందు శంఖూదటం. అది బూడిదలో పన్నీరు పోయటమేగా?''

"విన్నావుగా మామయ్యా! నాన్నవరుస. ఈవిధంగా అయనే వాడి నట్లా తయారుచేసాడేమో అనిపిస్తుంది. ఎన్నడు వాడిని మందలించిన పాపాన పోలేదు.'' అని కల్పించుకున్నాడు మహేంద్రుడు మధ్యలో.

"నీ పిచ్చి గాని వాడిని మందలిస్తేమటుకు మానుతాడట్రా? అన్నాడు రంగధామయ్య.

"వాడు మానడు బాగానే వుంది. అని మన మూరుకోవటమేమిటి? మన ప్రయత్నం మనం చేయాలిగాని.''

''ఊరుకోక చేసేదేముందని యిదివరకే చెప్పా."

''అయినా దీన్నంత తేలికగా పోనియ్యటం ఏం బాగుండలేదు బావా! వాడు ఫలానా—యిట్లా అయిపోయినాడు—అని నలుగురు అంటే ఆ అమర్యాద ఎవరికీ?" అన్నాడు జానకిరామయ్య.

''ఇపుడనక వూరుకుంటున్నారూ. కాకపోతే యిపుడు మొఖాన అనటం లేదు. ఇకముందు నాలుగురోజులుపోతే దానికి కూడా తెగిస్తారు. మనమేం ఆకాశం నుండి దిగొచ్చామా?''

"తండ్రివి నీవూరుకోబట్టె యిట్లా చేస్తున్నాడేమో?"

"అ—పేలాలేగింపి.వాడి కదేం లేదు. అది ఒక అడ్డన్న మాటే గాని దానివలన ఏం ఉపయోగం లేదయ్యా!''

"పోనీ ఆ అడ్డుగూడా తీర్చుకోరాదు?"

''అసలు వాడు కూటికేరాండే. వచ్చినా నాకంటికే కనుపించడు. ఎప్పుడో నే లేనప్పుడో వస్తాడు; ఆ నాలుగు మెతుకులూ తింటాడు; దారినబడతాడు. నాకంటబడ్డది యిన్నాళ్ళ యీ మధ్య నిన్ననేగా?'' గబగబా రామానుజయ్య రావటం చూసి జానకిరామయ్య ''ఏం! రామానుజయ్యా! అంత గాభరాగా వస్తున్నావు.'' అన్నాడు.

''చూడండిబాబూ! రాత్రి చిన్నబాబుగారింటికి రాలేదా?''

''ఔను! రాలేదు - ఏం ఎక్కడైనా కనుపించాడా?''

''ఔను బాబయ్యా! ఆ కోవెల దగ్గర పచ్చికలో పడుకున్నారు. రాత్రి అక్కడే పడుకున్నట్టున్నారు. గుఱ్ఱం కూడా అక్కడే ఉంది. ఇప్పుడు మీరు తొందరగా పోతే దొరుకుతారు. నేను లేపుదామనుకుని కూడా లేపుతే వెడతారేమోనని మీకు చెబుదామని వచ్చాను.''

''సరే నువ్వెళ్ళు. నేను వెళ్ళి కనుక్కుంటా'' అని బయలుదేరాడు చెప్పులు తొడుక్కుని ''ఉండు మామయ్యా! నేనూ వస్తాను'' అంటూ మహేంద్రుకు కూడా బయలుదేరాడు.

మహేంద్రుడు గుఱ్ఱపుబండి తోలుతున్నాడు. జానకిరామయ్య లోపల కూర్చున్నాడు. కొద్ది క్షణాల్లోనే బండి కోవెలఘట్టం చేరుకుంది. వాళ్ళకు చంద్రుడు అక్కడ కనుపించలేదు. నాలుగు వేపులా చూశాడు. కొండ యెక్కి కలయజూశారు. ఎక్కడ చంద్రుడి జాడగాని లేదు. ఆ ఎండ వేడిమికి మహేంద్రుడి ముఖకమలం ఎఱ్ఱవారిపోయింది. అతని వదనంలో తమ్ముని కనుగొనలేకపోయినందుకు విచారం ఎక్కువైంది. నిస్పృహ చెందాడు. కంటివెంట నీరొక్కటే తక్కువ. అది జానకిరామయ్య కనిపెట్టాడు.

''నాయనా! మహేంద్రా!''—అన్నాడు జానకిరామయ్య. అప్పుడు

మేనమామను చూడగానే మహేంద్రుడికి దుఃఖం ఆగలేదు. మామయ్యా! అని కౌగిలించుకుని పిల్లవానివలె బావురుమని ఏడిచాడు.

"మామయ్యా! తమ్ముడికి నేనేం అపచారం జేశాను? నేను పలక రిస్తున్నా చీదరించుకుంటాడే; నాతో మాట్లాడటమే వాడికి కష్టంగా ఉంటుంటే. ఉన్న ఒక్క తమ్ముడిని—తమ్ముడూ అని నోరారా పిలుచు కోవటానికే నోచుకోలేదా! ఆ భగవంతుడు నాకు వాడిమీద యింత మమకారం ఎందుకు పెట్టాలి? వాడిని చూడందే నేనొక క్షణం గూడా ఉండలేను మామయ్యా! వాడికెందుకు మామయ్యా! యీ కష్టాలు? వాడెం దుకు యీ కొండలు పట్టుకు తిరగాలి? వాడికేం లేకపోయింది?"

అని విలపించాడు అతనికి ఎందుకో ఆ తమ్ముడంటే అంత ప్రేమ. చేసేది లేక యిద్దరూ తిరిగి బండిమీద యింటికి బయల్దేరారు. వచ్చేప్పుడు ఎంత తొందరగా పోయిందో యిప్పుడు అంత ఆలస్యంగా వెళుతున్నది. ఆ బండిని తోలేవాళ్ళు లేరు. దానంతటదే పోతున్నది.

౮

పెళ్ళిరోజు సమీపిస్తున్నది. పెళ్ళి పనులు జోరుగా సాగుతున్నయి. చుట్టాలు వచ్చేవాళ్ళు వస్తున్నారు. రేపటిరోజే వివాహ ముహూర్తం. ఆరోజు పెళ్ళికూతుర్ని, పెళ్ళికొడుకును. చేస్తారు. ఇరువురి చుట్టాలు ఒకటే అవటంలో రంగధామయ్యగారి యిల్లు విశాలమైంది గనుక అంతా ఆయన యింటిలోనే మకాంవేశారు.

సుశీలను. మహేంద్రుడిని పెళ్ళికూతురు పెళ్ళికొడుకును చేశారు. సుశీల అప్పుడు ఎంత అందంగా ఉందో చెప్పటం చాలా కష్టం. మహేంద్రుడి విషయం కూడా అంతే. ఐశ్వర్యం అంతా అక్కడ మూరి కప్పు మూర్తీభవించింది. సుశీల బంగారు ముద్దగా గోచరిస్తున్నది. ఎఱ్ఱని జరీ సిల్కు లంగా కట్టింది. ఊదారంగు జరీ సిల్కు జాకెట్టు తొడి గింది. ఆకుపచ్చ జరీసిల్కు వోణీ వేసింది. ఆమె ఒంటిమీద ఆ జరీ

సిల్కు వోణీ సరిగా నిలవదు. దాని సరిజేసుకుని సిగ్గు మరుగు పరుచు కోటంలోనే సరిపోయింది రోజంతా. కాలికి బంగారు పాంజేబు పట్టాలు ధరించింది. చక్కగా తీర్చిదిద్దినపారాణా ఆ బంగారు కాంతులతో కలిసి ఎఱ్ఱని పసిడినిగ్గులు తేలుతున్నది. చేతికి బంగారు దండకడియములు, మెడలో విలువైన కంఠాభరణము. ఎంతో ముద్దుగా అలంకరించబడినది. శిరోస్నానం చేయటం వల్ల ఆమె శిరోజాలకు గలిగిన సొంపింతంత యనరాదు. వాటి మధ్య అపాపటిచేరుచాల ముచ్చటగా ఉంది. కళ్యాణపు బొట్టు ఆమె నెన్నుదురు నలంకరించింది.

వివాహవేళకు తమ్ముడు లేనందుకు మహేంద్రుడివదనం కొంచెం విన్నబోయింది. అదివరకు అక్కడ కనుపించాడు, యిక్కడ కనుపించాడు అన్న వార్తలన్నా ఉన్నయిగాని, మరీ మూడురోజుల నుంచి ఆ వార్తకూడా రావటంలేదు. అది మహేంద్రుడి మనస్సు బాగా కలవర పరచింది. ఎప్పుడూ అతనికి తమ్ముడిమీదనే ధ్యాన్నం.

తెల్లవారితే వివాహం చుట్టాలంతా యింటినిండా ఉన్నారు. పగలల్లా పనిపాటల్లో అలిసి అంతా నిద్రబోయేసరికి అర్ధరాత్రి దాటింది చాలమంది చుట్టాలు రంగధామయ్య యింటిలోనే పడుకొన్నారు. వారికంతగా దొంగల భీతి లేకపోవటంలో తలుపులు తీసియేయున్నవి. అంతా గాఢనిద్ర జెందారు. పెళ్ళికూతురు తండ్రిగారి యింటిలోపల గదిలో పడుకొన్నది. ఆమెకు కొంచెం దూరంగా వసారాలో తల్లి పడుకుంది. ఇంటిముందు చాలామంది చుట్టాలు పడుకున్నారు. పగలు సుశీల అమ్మలక్కల చేతిలో బాగా అలసిపోయింది. వళ్లు తెలియకుండా నిద్రపోతున్నది.

దొంకవైపునుంచి ఒక గుఱ్ఱము మెల్లగా వచ్చి గోడప్రక్కనే ఆగింది. దానిమీదనుంచి నల్లని దుస్తులతో ఒక మనిషి మెల్లగా లోపలికి ప్రవేశించాడు. సుశీల తల్లిముందునుంచే సుశీల ఉన్న గదిలోకి ప్రవేశిం

చాడు. ఎవరూ మేల్కొనలేదు. సుశీల తల్లికూడా మైమరచి నిద్రపో తున్నది. అతడు లోపలికి వచ్చి దొడ్డి తలుపులు తీసి సుశీలను కదిలించి చూశాడు కదలలేదు. సన్నగా దీపం వెలుగుతున్నది. ఆ దీపపు కాంతిలో ఆమె ముఖం. దానిపై ఆ కళ్యాణపు బొట్టు అతడ్ని కలవరపెట్టినట్టయి ఓర్పు పట్టలేకపోయాడు. మెల్లిగా తన క్రింద పెదవితో ఆమె ముఖాన్ని స్పృశించాడు. ఆమె కదలనేలేదు. ఆమె పెళ్ళికూతురువేషం విప్పలేదు. నగలు మాత్రం క్లుప్తంగానే ఉన్నాయి. పగలే నిలవని ఆ పమిట ఆ నిద్రలో రాత్రిపూట నిలుస్తుందా? అదేదో దారిచూసుకుంది. అతడు ఉద్విగ్న హృదయుడయ్యాడు. తను చేసిన ఆలస్యానికి తెలివి తెచ్చు కున్నాడు. ఆమెను మెల్లగా తన బుజాలమీదికి యెత్తుకున్నాడు. ఆమె మెత్తని ఉన్నత అవయవాలతన్ని గిలిగింతలు పెడుతున్నాయి. దొడ్డి దోవన తీసుకొని వచ్చి గోడ ఎక్కి గుఱ్ఱం మీదికి దూకాడు. గుఱ్ఱం మెల్లగా డొంకవెంట నడక ప్రారంభించింది. సుశీల ఆ మనిషి భుజం మీదే ఉంది. ఆమెకింకా మెలుకువ రాలేదు. గుఱ్ఱం దౌడు సాగించింది. ఏరు దాటి అవతలి ఒడ్డు చేరుకుంది. వేగం ఎక్కువైంది. గుఱ్ఱం కొండ చరియలగుండా ఏనుగ కొండ చుట్టవేసికొని కోవెల ఘట్టం చేరుకుంది.

సుశీలను ఆ మనిషి తీసికొని వచ్చి పచ్చికమీద పరుండబెట్టి తన చేత్తో ఆమె శిరోజాల్ని నిమురుతున్నాడు. ఆమెకు మెలకువ వచ్చింది.

౯

ఎవరది—అంటూ కలవరపోయి లేచింది సుశీల. మరుచటిరోజు పెళ్ళికుమార్తె. ఆకాశాన వెన్నెల తెల్లగా కాస్తున్నది. ఆ మనిషి మెల్లగా తన ముఖాన ఉన్న నల్లగుడ్డ తీశాడు. సుశీల ఆ వెన్నెల్లో అతడిని బాగా గుర్తుపట్టింది.

"బావ! చిన్నబావ!" అని ఒక్కమాటు అరిచింది. అపుడక్కడ ఎవరు లేరు వాళ్ళిద్దరు తప్ప. అది ఎటూగాని వేళ. అక్కడ అరవటం అరణ్యరోదనమే. ఎవరికి వినిపిస్తుందని?

"ఔను నేనే సుశీలా!"

"ఏమిటి బావా! ఇది అన్యాయం."

"ఏముంది ఏమీలేదు."

"నన్ను-ఇంట్లో పడుకున్నదాన్ని-నీవిక్కడికెట్లా తీసుకొచ్చావు?"

"ఏం చేతకాదనుకున్నావా? కోరికఉంది. ధైర్యం ఉంది. ఒంట్లో శక్తి ఉంది. చేతిలో గుఱ్ఱంఉంది. చాలదా? ఇంకా ఏమైనా కావాలా?"

"రేపు పెళ్ళిగదా నన్నిక్కడికి-యీ అర్ధరాత్రి ఎందుకు తీసుకొచ్చావు?"

"రేపు పెళ్ళి" అని వికటంగా నవ్వాడు.

"ఏం! కాదా?"

"ఓ! ఎందుకుగాదూ. దానికి అప్పటిదాకా ఎందుకు ఈ క్షణం లోనే జరుగబోతుంటే."

"ఏమిటి బావా! నీవనేది? నాకేం అర్థంకావడంలేదు!"

"ఏముంది. నీకర్థంకావటానికి. చిన్నపిల్లవు. నీకేం తెలుసునని తెలుసుకోవటానికి తెలియపరచటానికి. నేనేం చేసినా నీవొప్పుకోవలసిందే. లేకపోతే తెలుసుగా?"

"చిన్ననాటిపంతం పోనిచ్చావు కావే?"

"జ్ఞాపకముందిగదా! రక్షించావు. అదే యిపుడు నాకు శరణ్యం. చివరకది నాకు బాగ ఉపయోగపడింది. ఇంతకాలం నుంచి లేనిదంతా ఒక్క మాటు కరుడుగట్టి యిప్పుడు వలసినంతగా ఉపయోగించుకుంటాను."

"ఇంతకూ నీ ఉద్దేశం ఏమిటి?"

"ఏముందీ నీవు నాదానివి కావటమే."

"నేను బావను చేసుకుంటానన్నానుగా?"

"ఆ మొండిపట్టే నిన్నీ పరిస్థితికి తెచ్చింది. అపుదే నలుగురిలో నన్నే చేసుకుంటానన్నట్లయితే నీకీగతిపట్టి ఉండేదిగాదుగా; నాపంతం తెలిసుండి కూడా నన్ను నలుగురిలో ఎగతాళి చేయటానికి చూస్తావా, ఏన్నేరకంగానైనా సాధిస్తానన్నాను. సాధిస్తున్నాను."

"దొంగతనంగానా?"

"దొంగతనం! ఇందులో దొంగతనం ఏమిటీ! నాకు కావలసిం దాన్ని నేనెత్తుకొచ్చుకోటానికి? ఎవరూ రాలేదుగాని అడ్డువచ్చినట్లయితే వాళ్ళగతి కనిపించేది. ఇపుడు చెప్పు! ఎవర్ని చేసుకొనేది?"

"పోనీ నిన్నే చేసుకుంటాను. నా కెవరైతేనేం. నన్ను ఇంటికి తీసుకుపో" అని సుశీల ఏడవటం మొదలుపెట్టింది..

"అసినీ! ఎంత ఎత్తువేశావే! ఎట్లాగో ఇంటికిపోతే తరువాత ఎగగొట్టవచ్చుననుకున్నావుగదూ?"

"లేదుబావా! ఒట్టు!! నిన్నే చేసుకుంటాను."

"ఆడదాని ఒట్లునట్లు నమ్మి నాశనమయ్యే మగవాడుండడు. నా ముందరా నీ నాటకం. నీబొల్లేడుపులూను. నీవు ఒప్పుకున్నా నాన్న మామయ్య ఒప్పుకోవద్దూ. వాళ్ళు ఎట్లాగో అడ్డుతగుల్తారనేగా నీ యెత్తు. అయినా నీవు మట్టుకు ఎందుకు ఒప్పుకుంటావు?"

"ఎందుకు నీకంత పట్టుదల? ఇష్టంలేనిదాన్ని నీవు మటుకు చేసుకుని ఏం బాగుపడతావు?"

"ఏం ఎందుకు ఇష్టంలేదు? నేనేం బాగాలేకపోయానా? కాకపోతే మెత్తగాలేను మొత్తటానికి అంతేగా?"

"నన్ను విడువు. ఈ అర్ధరాత్రి నన్నెందుకేడిపిస్తావు?"

"ఇది రాత్రిగాదు. నిజమైన వివాహానికి సరియైన సమయం. ప్రదేశం. ఇష్టపడు, ఇక్కడ పెళ్ళిలేవి దేముడు గూడా ఉన్నాడు. ఆయన

అబద్ధమాడదు. ఆయన సాక్షిగా ఈ చెట్లు సాక్షిగా ఈ పక్షులు సాక్షిగా ఈ మనోహరమైన ప్రదేశంలో ఈ వెన్నెల పందిరిక్రింద వివాహమాడి ఏకమౌదాం."

"నిన్ను చేసుకోవటం నాకిష్టంలేదు. నాకక్కరలేదీ పెళ్ళి."

"నీయిష్టం ఎవడికి కావాలి? మంచిమాట లెందుకింటావు. చిన్నప్పటినుంచి అలవాటేగా మొండిపట్టుకు తగిన శాస్తి."

"నన్నేడిపించి నీవేం సుఖపడతావు బావా!"

"నా సుఖం నాకు కావాలి. తరువాత నీవే కుక్కలా నా వెంట పడతావు."

"ఇట్లా నన్నన్యాయంచేస్తే పాపంగాదు?"

"పాపం! ఎందుకూ పాపం! ఇది పెళ్ళి సుశీలా! పెళ్ళి ఇందులో పాపం పుణ్యం అనేదిలేదు. ఇందులో సమర్థత ప్రధానంగాని యింకోటి గాదు. రాజ్యం ఏవిధంగా బలంగలవాడిదో భార్యగూడా బలంగలవాడికే దక్కేది."

"అయితే, బావ నీకన్న బలం తక్కువవాడనా నీ అర్థం?"

"ఏదీ యిప్పుడు నిన్ను రక్షించమను? అని చేయిపట్టుకుని లేడిపై సింహంవలె దూకి ఆమె అధరాన్ని తనివిదీరా గ్రోలాడు. ఆమె వలలో బడ్డ లేడివలె తన్నుకొంది. ఆమె హృదయాన్ని తన హృదయానికి హత్తుకున్నాడు చంద్రుడు. అది ఆ బాహ్యమైందేగాని అంతర్గతమైంది గాదుగా!

ఆమె నిస్పృహ చెందిపోయింది. నిలువునా కూలిపోయింది. ఆ పచ్చికపై వాలిపోయింది. ఆమె పరాధీన. చంద్రుడు ఆమెలో లీనమైపోయినాడు.

౧౦

"ఏమండీ! అమ్మాయి కనుపించటం లేదు!" అంది ఆత్రంగా జానకి రామయ్య భార్య.

"ఆ—ఏమిటీ—అమ్మాయా" అంటూ జానకి రామయ్య కలవర పోయినాడు. అది అపుడే అంతటా ప్రాకిపోయింది.

ఇది విన్న మహేంద్రుడు వెంటనే బండి ఎక్కి కోవెలకు వడిగా తోలించాడు. ఇంకా మసక చీకటి వదలలేదు. అతడు కొండ ఎగువ మీదికి వచ్చేసరికి విశ్చేష్టుడైపోయినాడు. అతడు ఒక దృశ్యం చూశాడు. అదే అతన్ని అట్లా చేసింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. చంద్రుడు సుశీల ఒళ్లో పడుకుని ఒక ఆకును చుట్టగా మెలియబెడు తున్నాడు. సుశీల దీనంగా అతని కురుల్ని సవరిస్తున్నది.

చంద్రుడు అన్నను జూసి మెల్లగా లేచి కొండ పైకి పోయాడు. ఇదంతా మహేంద్రుడ్ని దిగ్భ్రాంతి చెందించింది. సుశీల సిగ్గుతో ముకు ళించిన ముఖంతో తల వంచుకుంది. మహేంద్రుడు దగ్గరకు వచ్చాడు. ఆమె అతనికి వాడిన కుసుమంలా తోచింది. ఆమెలో అతనికేదో నవ చైతన్యం కనుపించింది.

ఆమె ఒక్కసారి ఆయన పాదాల్ని ముట్టుకుంది. అవి దీసుకోవా లనుకున్నాడు మహేంద్రుడు, కాని అవి రాలేదు.

"క్షమించు! నేను నీకు నిజంగానే మరదలినయ్యాను. ఇకనుంచి మీరు నాకు శాశ్వతంగా బావగారు. కన్న కలలన్నీ మరోరీతిగా మారి పోయినయి. ఏది వద్దని కోరుకున్నానో అదే లభించింది. ఏ వ్యక్తితో జీవితాన్ని రోశానో ఆయనే నా భర్త అయినాడు. ఆయనతోనే నా జీవిత ఝరి సాగిపోవాలి. మెత్తని వాడివని, చెప్పినట్లు వింటావని నా ఆట

లన్నీ నీ ముందు బొమ్మలాటలుగా సాగిపోతాయని అనుకున్నాను. నా బుద్ధికి తగిన శాస్తి జరిగింది. నా కొంటె చేష్టలకు మొట్టికాయలు వేసే వాడే మొగడుగా దొరికాడు. నీ కోరిక నెరవేరింది. నీ కళ్ళిప్పటికీ చల్లబడ్డయి అనుకుంటాను. ఎంతో వైభవంగా అనేక మంది ముందర వివాహం జరుగుతుందనుకున్నాను. ఇక్కడ యీ రాత్రి వెన్నెట్లో బ్రహ్మచారి దేముడి ముందు ప్రకృతి మంగళవాద్యాల మధ్య జరిగింది. ఇది నా జీవితానికి కొత్త అంకం. నే నాడిచ్చినట్టుగా గాక నన్నాడించే వాడే భర్తగా దొరికాడు. ఇంకా నీకు విచారం ఎందుకు. నీకు యిస్తానన్న దాన్ని కాపాడుకో లేక ఊరికే బల ప్రదర్శనం చేస్తావు. ఎంత ఉంది ఏం ప్రయోజనం? దిక్కుమాలిన బ్రతుకు'' అంటూ గద్గదిక స్వరంతో అంతవరకు అపుకున్న శోకాన్ని ఒక్కమాటు వెళ్ళగక్కింది. అంతకు ముందు ప్రకోపించిన కోపాన్ని పై యీ కన్నీటి బిందువులు పడటం వల్ల అంతా చల్లారిపోయింది. ఆ సూదిపోటు మాటలు ఆయన్ని ములుకులై బాధించినయి. నిన్నటివరకు తనదిగా తన కౌగిటిలో అదుముకుని యివ్వాళ మరొకడి హృదయేశ్వరి అయిందంటే అతనికి ఎట్లా వుంటుంది. ఇదేనా ఆడబ్రతుకు. ఎవడికి బలముంటే వాడి కౌగిటిలో మ్రగ్గవలసిందేనా? నీతి నియమం అడ్డు తగలవా? నీతికన్నా నీచత్వానికేనా ప్రాధాన్యం. సుశీల ఏడుస్తూనే ఉంది.

మహేంద్రుడికేం తోచలేదు. అతని కళ్ళ వెంబడి వేడి కన్నీటి కణాలు రాలాయి. ఆ రాత్రి లేడి (సుశీల) సింహం (చంద్రుడు) కి ఎర అయిపోయింది. ఆమె శరీరం చంద్రుడికి అంకితం అయిపోయింది. ఇంక యిప్పుడు మహేంద్రుడు చేసేదేమిటి? కొండ పైకి చూస్తున్నాడు. తమ్ముడు హాయిగా పచార్లు చేస్తున్నాడు. ఇక యిద్దర్నీ—అంటే తమ్ముడిని మరదలిని యింటికి తీసుకొని పోవటమేగా కర్తవ్యం. తనేగా యింటికి

పెద్ద. అదే మాట అడిగాడు సుశీలని. చంద్రుడి యిష్టాన్ని కనుక్కోమంది సుశీల. ఆయన ఎక్కడుంటే తనూ అక్కడే అంది.

మహేంద్రుడు కొంత పైకి వెళ్ళారు. చంద్రుడు గ్రామం వేపు ముఖం పెట్టి తిలకిస్తున్నాడు అన్నను చూడనట్టుగా.

''తమ్ముడూ!'' అని పిలిచాడు.

"ఆ" అని వెనక్కు తిరిగాడు చంద్రుడు.

''ఇద్దరూ యింటికి రాండి వెడదాం'' అన్నాడు మహేంద్రుడు.

''అది నాన్నకు యిష్టం ఉంద వద్దు?" అన్నాడు చంద్రుడు.

అన్నా దమ్ములు మాట్లాడుకోక ఎంత కాలమైందో. జరిగింది ఎంత ఘోరకార్యమైనా తమ్ముడు తనతో మాట్లాడినందుకు అన్నకు ప్రాణం లేచి వచ్చింది.

''ఫరవా లేదు. నేనున్నానుగా, నాన్నకు నచ్చచెపుతాను. మీరు తింటేనే నేనూ తింటాను. నామాట మీద నీకు నమ్మకం లేదా?''

మహేంద్రుడు తలచుకుంటే ఏమైనా చేయగలడు. అది చంద్రుడికి తెలుసు. తన మీద ఆయనకు ప్రేమ ఉన్న సంగతి గూడా తెలియక పోలేదు.

''అన్నయ్యా!'' అన్నాడు చంద్రుడు.

మహేంద్రుడు ఆ పిలుపుకు ఆనందం పట్టలేక పోయాడు.

"తమ్ముడూ!'' అంటూ ఒక్క మాటు కౌగిలించుకున్నాడు.

''నేనేం చేసాను తమ్ముడూ! ఎంత కాలమైంది నీవు నన్ను అన్నయ్యా అని పిలవక. భయపడకు నాన్నతో చెబుతా. ఇదే లగ్నానికి మీ యిద్దరికీ వివాహం చేయిస్తా. నీవు గట్టిగా యిదివరకే చేసుకుంటానని నాతో చెప్పినట్టయితే సుశీలను ఎట్లాగో ఒప్పించేవాడినిగా.''

అదీ నిజమే. ఈ పిచ్చి ధర్మరాజుతో చంద్రుడు యిదివరకు ఏకాంతంగా అనలేదు గాని అన్నట్టయితే చంద్రుడినే చేసుకోమని సుశీలతో మాట వేసుకొని కూర్చునేవాడే. తమ్ముడు అంటే అతని కంత ప్రాణం.

"జరిగిందేదో జరిగింది. నాన్నతో—నీవొస్తేగాని వాళ్ల రామంటున్నారంటే బాగుంటుంది. ఆయన వచ్చి తీసికెళ్ళిన దారి వేరు."

"అట్లాగే నేను కాదన్నానా. నేను వెళ్ళి నాన్నను తీసుకువస్తాను. ఇప్పుడే వస్తా. ఇక్కడే ఉండండి."

అని బండెక్కి వెళ్ళిపోయాడు.

౧౧

కొద్దిసేపటిలోనే బండి మీద మహేంద్రుడు తండ్రిని మేనమామను అత్తను తీసుకొని వచ్చాడు. వాళ్ళని చూసి చంద్రుడు కొండ మీది నుంచి దిగి వచ్చాడు. సుశీల తల్లి రాగానే కూతుర్ని కౌగలించుకు గోడుగోడున ఏడిచింది. ఇక సుశీల సంగతి వేరే జెప్పనక్కరలేదు. సుశీల తన పెదవి విప్పలేదు. ఆమె మహా యిల్లాలు. లేకపోతే ఆ జరిగిన పనికి చంద్రుడిని ఎంతగా ఆడిపోసుకుందేదో. చంద్రుడు చేసిన ఆ అఘాయిత్యానికి ఆమె గాబట్టి గాని యింకొకరైనట్టయితే ఎంతగా ఉసురు పోసికొని ఉండేవారో. వాళ్లిద్దరూ ఏడుపు తప్ప ఏమీ మాట్లాడలేక పోతున్నారు. దుఃఖం తెరలు తెరలుగా పొరలి వస్తున్నది. పెదవులు తెరిపిడి పడటం లేదు

చంద్రుడు నిర్విణ్ణుడై నిలబడి పోయాడు. జానకి రామయ్య తనకు జరిగిన ఆ మహావమానానికి కడుపులో కాలిపోతున్నా మేనల్లుడిని ఏమీ అనలేక, అన్నా లాభం లేదనే తలంపుతో లోపల కుములుతూ గ్రుడ్ల

నీరు గ్రక్కుకుంటున్నాడు. మహేంద్రుడి తరహా వేరు. ఆయన ముఖంలో విచారం గాని నిర్విచారం గాని కనుపించటం లేదు. అమాయికపు దృక్కులు ప్రసరింపబడుతున్నాయి. ఇక మిగిలింది రంగధామయ్య. ఆయన అక్కడి వారికి సింహం. హృదయంలో గర్జిస్తున్నాడు. కొడుకును మ్రింగుదామన్నంత కోపంతో కోపాగ్ని జ్వాలలు గ్రక్కుతూ కోరలు జాస్తున్నాడు. ఆయన కోపాతిరేకంచేత స్తంభించి పోయాడు. ఇక అక్కడ మాట్లాడేదెవరు. కోపంతో రంగధామయ్య కొడుకుని చుర చుర చూస్తున్నాడు. చంద్రుడు ఆ చూపులకు తట్టుకోలేకపోతున్నాడు.

''జరిగిందేదో జరిగిపోయింది, ఇక యింటికి పోదామా నాన్నా!'' అని అన్నాడు. ఎదుర్కొన్న ఆ సమస్యను కదిలించాడు. అది తీగె తీస్తే డొంక కదిలినట్లయింది.

''నా కడుపున చెడబుట్టాడు! కసాయివాడు. పాలుబోసి పెంచితే పామై కాటేశాడు. నీతి నియమం లేని నిర్భాగ్యుడు. వీడిన్నరికినా పాపం లేదు.''

అని చంద్రుడి మీదికి పోబోయాడు రంగధామయ్య. దానికి జానకి రామయ్య అడ్డుపోయి ఆయన రెండు చేతులు పట్టుకుని వారిస్తూ ''బావా అయిన పెళ్లికి మేళమెందుకు. జరగవలసిందేమో చూడక? మన మొక రకంగా ఆలోచిందాం దైవం యింకొక రకంగా నిర్ణయించాడు. వాడికి రాసిపెట్టుంది. ఈ రూపేణా భగవంతుడు వాళ్ళనిట్లా ఏకం చేశాడు. ఇందులో నా ప్రయత్నం నీ ప్రయత్నం అని భ్రమ పడటమే గాని మానవ ప్రయత్నం దైవ సానుకూలం లేందే ఒక్కనాటికి సాధ్యపడదు. దానికి వాడి భార్య గావలసిన యోగం ఉంది. అది నీకూ నాకూ దానికీ యిష్టం లేకపోతే సరిపోయిందా; ఆ పరమేశ్వరుగి కటాక్షం కూడా ఉండనక్కరలేదా? ఎవరైతేనేం! వాడు మాత్రం పరాయివాడా, మేన

ల్లిదే గదా! నాకు నీకు వాళ్లిద్దరు చెరి ఒక కన్నే గదా! ఇందులో లేదా ఏముంది. వాడికి స్వతంత్రం ఉన్నది గనుకనే చేతనయిన వాడు గాబట్టి తన మరదల్ని యీ రూపేణా భార్యగా చేసుకొన్నాడు. వివాహం విష యంలో పట్టుదలతో కోరిన దాన్ని సాధించినందుకు వాడి పట్టుదలను, అందుకు తోడ్పడ్డ దైవాన్ని ఎంతైనా పొగడాలి. వాడిని కోప్పడి ప్రయో జనం ఏముంది. ఇంక నీ పెట్టి మాని కొడుకుని కోడలిని స్వీకరించు బావా!''

అని తియ్యటి మాటల్ని చెప్పారు. అవి ఆయన హృదయా న్నెంతో సరిపెట్టుకుని అన్న మాటలు. దానికి రంగధామయ్య హృదయం చలించింది. పుత్ర ప్రేమ ప్రస్ఫుటించింది. కొడుకును అనునయించాడు. ఇంటికి బయలుదేరమని స్వయంగా అనగలిగాడు. నిజంగానే రంగ ధామయ్య అదివరకు తన హృదయంలో అవురించిన తమస్సు నుంచి విముక్తుడయ్యాడు. అతనికి గుండెలో బరువు తీసినట్లయింది. కొడుకును నిండు హృదయంలో సతీసమేతంగా గృహ ప్రవేశానికి ఆహ్వానించాడు.

౧౨

పెళ్లి వేళ సమీపిస్తున్నది. అసలు పెళ్లి జరిగే విషయం గురించి అంతా దీర్ఘాలోచనలో బడ్డారు. ఇప్పుడు వివాహం జరుగవలసింది ఎవ రికి? చంద్రుడికి సుశీలకు. అయితే పెద్దవాడికి కాకుండా చిన్న వాడికి వివాహం చేయటమా? పోనీ వివాహాన్నిప్పటికి ఆపితే, అది ఎవరికి యిష్టం లేదు. ఇంతలో ఆరోజు మహేంద్రుడికి సుశీలకి విందు జరిపిన పెద్ద మనిషి అక్కడికి వచ్చారు.

"ఏం రాఘవయ్యా! ఇట్లా వచ్చావు" అన్నాడు రంగధామయ్య. ఆయన కోపం అంతా యిప్పుడు మబ్బు విడి పోయినట్లు విడి పోయింది! పై పెచ్చు ఆయన కేమిటో చీకాకు తీసినట్లుంది. రాఘవయ్య కూర్చున్నాడు.

"పనుండీ వచ్చా నన్నయ్యా!"

"నాతోనా?"

"అవును నీతోనే. కాని నామాట తీసెయ్యవు గదా?"

"ఏమిటి రాఘవయ్యా! ఇవ్వాళ కొత్తగా మాట్లాడు తున్నావు"

"అవు నన్నయ్యా! అట్లాంటి అవసర మొచ్చింది."

"నీ మాట కాదంటానా చెప్పు ఏమిటో."

"మన సుశీలను చిన్న వాడికియ్యటానికి నిశ్చయించారుటగా?"

"అవును. ఏం?"

"మరి పెద్దవాడికి యిప్పుడు పెళ్లి చేయందే చిన్న వాడికి చేస్తావా?"

"అదే ఏమీ తోచటం లేదు."

"మరి పిల్ల నెక్కడైనా చూశారా?"

"అదే యిప్పుడొచ్చిన చిక్కు. ఈ లగ్గానికి వివాహం ఆపేది లేదు. అద్దదంటే ఎవరు సిద్ధంగా ఉన్నారు యిప్పుడు పిల్లనివ్వటానికి?"

"అయితే యీ అవకాశం నాకిస్తావా?"

"అంటే?"

"మరేంకాదు. నిరుడు మా పెద్ద చెల్లెలు చచ్చి పోయిన సంగతి నీ వెరుగుదువుగా?"

"అవును రత్తమ్మగా! ఎరక్కేం బాగానే ఎరుగుదును."

"దానికి రత్నం లాంటి కూతురు ఉంది. నిన్ననే వచ్చింది యిక్కడికి. మన సుశీల యీడే మన సుశీల లాగ ఉంటుంది. వాళ్ల స్థితి గతులు నీవెరుగనివిగావు. మన వాడి విషయం యిప్పుడే విన్నాను. నీవు ఊ అంటే దాన్ని యీ లగ్గానికే మన మహేంద్రుడికిచ్చి నేను వివాహం చేస్తాను."

"ఏమిటి రాఘవయ్యా! నీ విషయంలో...."

"ఫరవాలేదన్నయ్యా! బావకి చేతిలో చిల్లి గవ్వ కూడా యివ్వడు లేదు. అయినా ఎప్పటికైనా నాకు తప్పదు. మన యింట్లోనే చేద్దాం అన్నీ మీరు కానివ్వండి. నేను పిల్లని తీసుకొస్తాను" అని వెళ్లిపోయాడు. అది రంగధామయ్యకు పట్టలేనంత ఆనందాన్ని కలిగించింది. తనకు తలవని తలంపుగా యింకొక కోడలు వస్తున్నందుకు సంతోషాన్ని పట్టలేక పోతున్నాడు.

వివాహాలు జయప్రదంగా జరిగిపోయాయి. శారదది కోల ముఖం శారద సుశీలలో గల వ్యత్యాసం అదే అందంలో వారిద్దరు ఒకర్నొకరు మించుతారు. శారద తండ్రి బస్తీలో చిన్న ఉద్యోగి. ఆమె బీద యింటి ఆడబడుచు. చదువుకున్న పిల్ల సంగీతంలో నిధి.

మహేంద్రుడు అదృష్టవంతుడు. ఆయనకు అందచందాలు నిత్యము తను అభిలషించే సాహిత్య జ్ఞానంతో బాటు సంగీతం గూడా శారదాదేవి పట్టపు దేవి అయింది.

శారద, మహేంద్రులను, సుశీలా చంద్రులను నాటి రాత్రి పడక టింట్లకు పంపించారు.

౧౩

రోజులు వారాలు పక్షాలు నెలలు ఋతువులు దొర్లిపోతున్నాయి. చంద్రుడికి అందచందాలొలికించే ముద్దు పాపడు పుట్టాడు. అంతా ఆనందోత్సవంలో మునిగితేలారు. అతనికి అచ్చంగా తండ్రి ముఖమే. మూడు సంవత్సరాలు గడిచాయి. చంద్రుడికి ఆడపిల్ల పుట్టింది. ఇపుడు శారద మగశిశువును గన్నది. ఆ పాపడు శారద ముఖంతో కళకళలాడుతున్నాడు. వారి యిల్లు పాపలతో నిండింది.

చంద్రుడు తన స్వభావాన్ని విడువలేదు. ఎప్పుడో అర్ధరాత్రి వస్తాడు. భార్య ఎన్నడూ సరిగ మందలించలేదు. ఆమె అతని అడుగులకు మడుగులొత్తుతున్నది. ఆమె ముఖంలో దీనత్వం ఎక్కువగా కనుపిస్తుంది. చాల పాలిపోయింది. ఎపుడోగాని నవ్వదు. ఆనవ్వు నీరసంగా ఉంటుంది. ప్రతిపని ఆమె చేయబోతుంది. ఎపుడోగాని ఆమె మహేంద్రుడి కంటబడదు. ఆమెను చూసినపుడు మహేంద్రుడు నిర్జీవుడై పోతాడు. అతనికి ప్రాణంపోయినట్లనిపిస్తుంది.

శారదా మహేంద్రులొక్క క్షణం గూడా విడిచిపెట్టి ఉండలేరు. ఆ పాపడు పుట్టడం వల్ల వారికి నిత్యం అతని పనిలో విరామం ఉండదు. అది తప్పితే ఆమె భర్తను ఉత్కృష్టమైన సాహిత్య చర్చలో దింపుతుంది. మహేంద్రుడు కొంచెం సంస్కృతం గూడా చదువుతున్నాడు. స్వయంకృషితో దానిని పరిపక్వం జేశాడు.అందులో ఆయనకు అనుభవం కన్నా అభిమానం మెండు. ఆయనకు భాసుని నాటకాల మీద మక్కువ ఎక్కువ. ఆయన కావ్యాల్ని బాగా చదివి అర్థం చేసుకోకపోయినా

వాటి ఆంధ్రీకరణాలు చదివి ఎంతో తృప్తి చెందుతాడు. ఆయన ఒకప్పుడు తండ్రితో గుంటూరు పనిమీద వెళ్ళి అక్కడ అనుకోకుండా లభించిన శ్రీజమ్మలమడక మాధవరామశర్మగారు సంస్కృత నాటకాలపై చేసిన యుపన్యాసాన్ని విన్నాడు. అందులో ఆయన భాసుడాని గురించి చెప్పిన మాటలు ఆయన్ను తలుచుకున్నప్పుడల్లా మహేంద్రుడి చెవిలో గింగురుమంటుంటయి. భార్యకు భాసుని రచనా వైదుగ్ధ్యాన్ని గురించి చెబుతూ ఆమెను ముగ్ధురాల్ని చేస్తాడు. సుశీల కూడా అపుడపుడు వింటుంటుంది. అందులో కథా భాగంగా చెబుతున్నంత వరకు ఆమెకు ఆనందంగానే ఉంటుంది. రసాన్ని ఔచిత్యాన్ని విమర్శిస్తుంటే ఆమెకు అర్థంగాక తనపని తాను చూసుకోపటానికి పోతుంది.

అపుడపుడు అతని దగ్గరకు లింగయ్య వచ్చి సలహాలు తీసుకొని పోతుంటాడు. శారదా మహేంద్రులు అనేకసార్లు పఠమందిరాన్ని సందర్శించి వచ్చారు.

ఆ పఠమందిరం చాలా అందమైంది. అది అరఎకరం విస్తీర్ణం గలది. అది రంగరామయ్యగారిచే దానం చేయబడింది. అందులో రంగధామయ్యగారి పెదతండ్రిగారి కుమారుడొకడు బ్రహ్మచారిగా ఉండేవాడు. ఆయన గతించగానే అది రంగధామయ్యకు వారసత్వంగా వచ్చింది. అందులో నాలుగు దూలాల పెంకుటిల్లుంది దాన్ని మహేంద్రుడు పఠమందిరంగా జేస్తానని అన్నాడు. అటువంటి వ్రజాల కొడుకు అడిగితే రంగధామయ్య లాంటి తండ్రి కాదనగలడా?

అది యిపుడు దినాదినాభివృద్ధి చెందుతున్నది. ఆ ఇంటిలో నడమ విశాలమైన హాలు ఉంది. అందులో ఎదురుగా గోడమీద సున్నితము విశాలమైన ఆంధ్ర శారదమూర్తి కళకళలాడుతున్నది. దాని ప్రక్కనే

నన్నయగారి చిత్రం ఒకవైపు వీరేశలింగంగారి చిత్రం యింకొక వైపు ఉన్నయి. లింగయ్య గొప్ప చిత్రకారుడు. ఆ యిద్దరాంధ్ర కవుల చిత్రాలు ఆయన లిఖించినవే. నన్నయ చిత్రాన్ని ఊహించి వ్రాశాడు. దాని క్రింద-ఆది ఆంధ్ర వాఙ్మయ నిర్మాత-అని వ్రాయబడి ఉంది. అదే ఆయన్ని నన్నయగా గుర్తింపజేస్తుంది. వీరేశలింగంగారి చిత్రం క్రింద నవ్యాంధ్ర వాఙ్మయ నిర్మాత-అని వ్రాయబడి ఉంది. అది చెప్పకయే ఆయన పేరును తెలియజేస్తుంది. ఉత్తరపు వైపు గోడమీద భాసుని ఊహా చిత్రం లిఖించబడి ఉంది. క్రింద-మహాకవి భాస-అని మాత్రం వ్రాయబడి ఉంది. దానికెదురుగా దక్షిణవైపు గోడమీద శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి చిత్రం ఉంది. ఇది అక్కడ మిగిలిన కవుల చిత్రములకన్న పెద్దది. మహేంద్రుడు దీన్ని, శారదాదేవి చిత్రాన్ని ఒక గొప్ప చిత్రకారునిచే వ్రాయించాడు. దీనిక్రింద పేరు సూచింపబడలేదు. ఆయన ఒక అభాగ్యుడైన చిత్రకారుడు. విద్య ఉంది భుక్తి లేదు. మహేంద్రుడాయనకు నూటపదహార్లు దువ్వలువలు యిప్పించి, సత్కరించి తండ్రిగారితో జెప్పి ఆయూరి యున్నత పాఠశాలలో చిత్రలేఖనా బోధకులుగా ఉద్యోగం యిప్పించాడు.

ఆయేడు సంవత్సరాదినాడుశారద ఆ ఆంధ్ర శారద పటాన్నావిష్కరించింది. శ్రీ రంగథామయ్యగారు ఆ సభకి అధ్యక్షత వహించారు. ఆయన శ్రీ సత్యనారాయణగారి పటాన్నావిష్కరించారు. మిగతా వారి పటాలావరకే ఉన్నయి. వాటి స్తానాలు మాత్రం మారినయి, అంతే. రంగథామయ్య, పెద్దకోడలు శారద వైపు చూస్తూ మహేంద్రుడితో-నేను దీనికి శారదా నిలయం-అని పేరుపెడుతున్నానన్నారు. శారద నవ్వుతూ సిగ్గుతో తలవంచుకుంది. చూడవచ్చిన వారంతా ఆనందంతో కరతాళ ధ్వనులు జేశారు.

సభ వసారా అరుగుమీద పెద్దలంతా ఆశీనులవటంతో ప్రారంభం అయింది. జనంతో ముందు స్థలం అంతా నిండి ఉంది. శారద మహేం ద్రుడు వ్రాసిన సరస్వతీ ప్రార్థన గీతంతో సభను ప్రారంభించింది. మహేంద్రుడు తెలుగు సాహిత్యంలోని ఉత్కృష్టత గురించి, దానికి సంస్కృతానికి గల సంబంధాన్ని గురించి ఉపన్యసిస్తూ పెక్కు కవుల పేర్లు సూచిస్తూ వారి రచనా వైదుష్యం కొనియాడుతూ ఆధునికులలో శ్రీ సత్యనారాయణగారి ఉన్నత స్థానాని గురించి సహేతుకంగా నిరూ పిస్తూ కొనియాడారు. ఆయనపై ఆతనికి గల అభిమానానికి ఆ చిత్రమే సాక్షి.

శారద శ్రావ్యంగా కిన్నెరసాని పాటలు పాడింది. శారద సుశీల, మహేంద్రులు వచ్చిన వారికి మిఠాయి పంచిపెట్టారు. సభ జయప్రదంగా ముగిసింది.

౧౪

సుశీల ముఖం యింతవరకు వికసించనేలేదు. వికసించే విధానం గూడా కనుపించటంలేదు. వివాహం చేసుకున్నాడన్న మాటే గాని భార్యతో అన్యోన్యం ఏవరూ చూసి యెరుగరు. సుశీల ఏ విషయం బయటికి పొక్కనివ్వదు.

ఒకరోజు శారద సుశీల చెయ్యి పట్టుకుంది ఏదో చెప్పబోయి సుశీల అబ్బా!-అన్నది. సుశీలను బలవంతాన శారద లోపలికి తీసుకొని పోయి చూసింది. సుశీల బుజంమీద నల్లని కదుము కనిపించింది.

"ఏమిటిది!"

శారద హృదయం కంపించింది. భయంవేసింది. సుశీల మాట్లాడ లేదు.

"ఏమిటి సుశీలా! మాట్లాడవేం? ఇక్కడెందుకు తగిలింది దెబ్బ" అంటూ శారద గాభరాపడింది.

"ఏమీలే"దంది సుశీల దుఃఖాన్ని ఆపుకుంటూ.

"ఏమీలేదంటావేమిటి ఇంత దెబ్బ తగిలితే? ఎవరైనా కొట్టారా?"

సుశీలకు దుఃఖం ఆగలేదు. శారదను కౌగిలించుకుని ఏడిచింది.

"అంతా నీ భర్తలె దైవంలాగుంటారా అక్కా!"

శారదకు అర్థమైంది. అది చంద్రుడి కొరడా దెబ్బ. శారదకు వళ్ళు జలదరించింది. ఒణుకు పుట్టింది.

"అత్తయ్యతో చెప్తాస్తా."

"వద్దక్కా! నీకు పుణ్యం ఉంటుంది. చెబితే ఏం లాభం? అల్లరి పడటమేగా."

శారద బైటికి వెళ్ళింది. ఆ విషయం భర్తతో చెప్పింది. సుశీల గదిలోంచి బైటకు వచ్చింది. మహేంద్రుడు సుశీలవైపు దీనంగా చూశాడు. సుశీల అది గమనించి తలవంచుకుని లోపలికి వెళ్ళిపోయింది. మహేంద్రుడు శారద ముఖంలోకి చూశాడు. శారద కుంపటి గిన్నెలో నీళ్ళు తీసుకొని పోయి తన పమిట చెంగు ముంచి సుశీలకు తగిలిన దెబ్బ కాపుతున్నది. సుశీల ఆమె ఒళ్ళో సొరిగిపోయి ఉంది. ఇంతలో చంద్రుడు వచ్చాడు. వదినగారు చేస్తున్న పని చూసాడు కిటికీలోంచి. వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

రెండురోజులైంది చంద్రుడు కనుపించటంలేదు. చంద్రుడి జాడ పొత్తిగా తెలియుటలేదు. సుశీల అతనికోసం తపించిపోతున్నది. ఉద యానవెతకటానికి పోయిన మహేంద్రుడు నిరాశగా వస్తున్నాడు. మొగుడి

జాడ తెలిసిందేమో అని పెద్ద ఆశతో బావకు వాకిట్లో ఎదురు వచ్చింది. సుశీల.

"బావా!" అంది ఆశగా. ఆ బావ బండి అయినాడు. పెదవి విప్ప లేదు. నిరాశ మాత్రం కనుపించింది.

ఆమె నాదువ్యధతో అక్కడే అరుగు మీద కూలిపోయింది. ఆమె నానుకుని అంతా నిలబడ్డారు. ఎందుకు కొండంత బలగం. ఇంతమంది కలిసి తన మొగుణ్ణి తీసుకురాలేకపోయినారు. ఎంత మంది ఉన్నా ఆయన కారుగా?

ఇంతలో ఎవరిదో గజ్జల గలగలతో ఒక బండి పరుగెత్తుకుని వస్తున్నది. అది వారింటి ముందే ఆగింది. అంతా విభ్రాంతులై అటు చూస్తున్నారు. అందులోంచి రక్తసిక్తమైన ఒక మనిషిని ఇద్దరు దింపు తున్నారు. తమ్ముడూ!—అంటూ మహేంద్రుడు అక్కడే కుప్పకూలి పోయాడు.

చంద్రుడిని లోపలకు తీసుకు వెళ్ళారు. మహేంద్రుడ్ని ఒక మంచంమీదికి చేర్చి ముఖం తుడిచారు. అతనికి మెలకువ వచ్చినది. లేచి చూసే వరికి తల్లి సుశీల చంద్రుడి మీదపడి గోడుగోడున ఏడుస్తు న్నారు. దూరాన నిలబడి శారద గ్రుడ్ల నీరు కుక్కుకుంటున్నది. రంగధామయ్య చేత్తో తలపట్టుకున్నాడు. ఇంతలో జానకిరామయ్య డాక్టరును తీసికొని వచ్చాడు.

చంద్రుడికి శస్త్ర చికిత్స చేయబడింది. అతని నుంచి అతని ఎడమకాలు తొలగించబడింది. అంతేకాదు అతనికి ప్రాణప్రదమైన ఆ ఆశ్వం కొండ చరియల్లో అసువులుబాసింది. తెలివచ్చిన తరువాత అన్నీ తెలుసుకు అశ్రువులు రాల్చాడు.

అతడిపుడు అనిటివాడు. సుశీల చేతి ముద్దు బిడ్డడు సుశీలకు మూడోబిడ్డడైనాడు.

చంద్రుడిపుడు సుశీలను క్షణం విడవడు. అన్నయ్య యెప్పుడు తనదగ్గరే ఉండాలి. అన్నయ్య తనకు ఏవేవో విషయాలుచెప్పాలి.

శు భ ం.

PRINTED AT :
VIR MILAP PRESS, (OFFSET PRINTERS, & BLOCK MAKERS)
Mukaramjahi Road, Hyderabad.

విజ్ఞాన దీపిక

ప్రకృతి స్వరూపమే విజ్ఞాన సర్వస్వము

విజ్ఞానదీపిక ఒక సాంస్కృతిక సంస్థ. భారతీయ శాస్త్రములను విజ్ఞానఖనులైన వారినుండి గ్రహించి కళలను అభివృద్ధికి తీసికొని వచ్చుట మా ముఖ్యాశయము.

విజ్ఞాన సర్వస్వమైన ప్రకృతి నారాధించువాడు ద్రష్ట. ద్రష్ట కవి. కవి స్రష్ట స్రష్టభావుకుడు భావనాసంపత్తి విజ్ఞానము. సకల శాస్త్రములు ప్రకృతి నుండియే గ్రహింపబడినవని భారతీయుల నమ్మిక. విజ్ఞాన సముపార్జనమునకు ప్రథమాధిష్ఠాన దేవత ప్రకృతి.

జాతీయ జీవనమే స్వాతంత్ర్య లక్ష్యము

భారతజాతి పరపీడితయై జీవనపథమున కుంటువడియున్నది. ఏజాతి స్వాతంత్ర్యము ఆజాతి రక్షించుకొన్నగాని స్వతంత్ర జీవనమైన జాతీయ జీవన లక్ష్యమును సాధించలేదు. జాతీయ జీవన దృక్పథము నగాని స్వాతంత్ర్య లక్ష్యము సార్థక్యమందదు.

నవభారత నిర్మాణమే భారతీయుల ఆశయము

నేటి భారతదేశము శిథిలమైయున్నది: ఆశిథిలములను పునర్నిర్మించి నవభారతమును ఆవిష్కరింప జేయవలయును. భారతీయుడుగా ప్రతి వొక్కనియందు ఆ లక్ష్యము దీక్షయుండవలయును. ఇది నాజాతి: ఇది నా దేశము: ఇది నాభాష: అన్నగర్వము, అభిమానము లేకపోయిన అభివృద్ధి జెందవు.

మహానుభావు లెందరో మార్గదర్శకులున్నారు. వారి దివ్యపథముల ఉద్యాన వనములు నిర్మించుట మనవిధి.

“ మరదలు ” స్రవంతి నుండి పునర్ముద్రితము.



శ్రీముఖ నామ సంవత్సర ఆషాఢ శుద్ధ సప్తమి శుక్రవారము వీరు ఖమ్మంజిల్లా మధిర తాలూకా "ఎర్రుపాలెం"లో ప్రసిద్ధి చెందిన జములాపురపు కేశవరావుగారి వంశములో జన్మించారు. పితామహుడు, కీ. శే. వేంకట కిషన్ రావుగారు ఆరోజులలో సుప్రసిద్ధులు.

తల్లి దుర్గమాంబ, తండ్రి కీ. శే. రామనరసింహారావు గారలు. చిన్నతనంలోనే పినతల్లిగారు పిల్లలులేక పెంచుకోవడం వలన బెజవాడలో "అయ్యదేవర" వారింటిలో పెరిగి, అక్కడే విద్యాభ్యాసం చేశారు. పెంపుడు తల్లి దండ్రులు: రంగనాయకమ్మ, లక్ష్మీనరసింహారావు గారలు. విద్యాభ్యాసం, యస్. ఆర్. ఆర్ & సి. వి. ఆర్ కళాశాల ప్రస్తుతం రాజధాని నగరంలో స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్నారు.

సాహితీ పిపాసే కాక నాటక కళలో కూడా వీరికి ప్రవేశం ఉంది. సాహిత్యంలో అభిమానం విశ్వనాథ వారిమీద, అనుసరణ బాపిరాజు.

" విజ్ఞానదీపిక " సంస్థాపకులలో ప్రధానులు, ప్రస్తుతం దానికి కార్యదర్శులు.

MARADALU

by

Ayyadevara Purushotham Rao

PRICE

Rs 1.